www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 01 | గురువారం | 30 జూలై, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169



# ఎడతెరిపిలేని వానలు

## తెలంగాణను ముంచెత్తుతున్న భారీ వర్షాలు

- తీవ్ర వాయుగుండం ప్రభావంతో విస్తారంగా వర్షాలు
- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- రాకపోకలకు అంతరాయం

**ప్రజానావ, హైదరాబాద్:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండగా, పలు ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. కొన్ని చోట్ల రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జలాశయాలు నిండు కుండల్లా మారాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇవాళ, రేపు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో వర్షాల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, ఖమ్మం, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, సంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలు, వాగులు, వరద ప్రభావిత ప్రాంతాల వద్ద అనవసరంగా సంచరించవద్దని వాతావరణ శాఖ సూచించింది.

### మరో మూడ్రోజులు వానలే..

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తర ఒడిశా–గంగానది పశ్చిమబెంగాల్ ప్రాంతాలపై కేంద్రీకృతమై పశ్చిమ వాయవ్య దిశగా తరువాయి 2లో..

## కడెం ప్రాజెక్టుకు భారీ వరద

- ఎగువ ప్రాంతాల నుంచి 21,583 క్యూసెక్కుల వరద ప్రవాహం
- మరో రెండ్రోజుల్లో గేట్లు ఎత్తే అవకాశం
- దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

2

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం

## 10 ఏళ్ల జైలు, రూ.50 లక్షల జరిమానా

- ప్రతిపక్ష ఆందోళనల మధ్య సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- నీట్ కేసులో ప్రభుత్వం వేగంగా స్పందించిందన్న కేంద్రం



**న్యూఢిల్లీ:** ప్రజా పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా పరీక్షలు (అక్రమ మార్గాల నిరోధక) సవరణ బిల్లు–2026కు లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య బిల్లును సభ ఆమోదించింది. సవరణల ప్రకారం పేపర్ లీక్‌లకు పాల్పడిన వారికి గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 50 లక్షల జరిమానా విధించే అవకాశం కల్పించారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ జూలై 27న ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఇటీవల నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటన నేపథ్యంలో విద్యార్థి ఆందోళనలు దేశవ్యాప్తంగా తీవ్రరూపం దాల్చిన తర్వాత ప్రభుత్వం చట్టాన్ని మరింత కఠినతరం చేసింది. బిల్లుపై చర్చ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. 2024లో పేపర్ లీక్‌ల నిరోధక చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా 52 ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయని తెలిపారు. నీట్ పేపర్ లీక్ కేసులో ప్రభుత్వం వెంటనే స్పందించి దర్యాప్తు చేపట్టిందని చెప్పారు.

### అనుభవాలతో చట్టానికి పదును

అమల్లో ఉన్న చట్టం అనుభవాల ఆధారంగా మరింత సమర్థంగా పనిచేసేలా సవరణలు తీసుకొచ్చామని, లీకేజీల కారణంగా విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య కూడా కొన్నేళ్లలో తగ్గుముఖం పట్టిందని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీకి పార్లమెంటరీ విధివిధానాలు, ప్రభుత్వ పనితీరుపై సరైన అవగాహన లేదని విమర్శించారు. బిల్లు ఆమోదం అనంతరం సభను రోజంతా వాయిదా వేశారు.



## రాహుల్ వ్యాఖ్యలతో లోక్‌సభలో దుమారం

- విద్యార్థుల ఆందోళనపై కేంద్రంపై విమర్శలు
- ఆర్ఎస్ఎస్, అమిత్ షాపై ఆరోపణలు
- ఇడియట్స్ వ్యాఖ్యలపై బీజేపీ అభ్యంతరం
- రికార్డుల నుంచి తొలగింపు

2



2

## ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి

- ఎస్ఐఆర్‌లో బీఎల్‌వోల సేవలను ప్రశంసించిన కాంగ్రెస్ సమన్వయ కమిటీ
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచన
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ దృష్టి

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

- ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2



## కాళేశ్వరంపై బీఆర్ఎస్ మాట్లాడటం సిగ్గుచేటు

- నాసిరకం డిజైన్, నిర్మాణమే సమస్యలకు కారణం
- ఎన్డీఎస్ఏ సూచనల మేరకు మరమ్మతులు చేపడతాం
- రైతులకు సాగునీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**న్యూఢిల్లీ:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన నాణ్యత లోపాల వల్లే ప్రస్తుతం సమస్యలు తలెత్తాయని, అలాంటి పరిస్థితిని సృష్టించిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ప్రాజెక్టుపై మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రాజెక్టు సక్రమంగా నిర్మించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదే కాదన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకు నిపుణుల సహకారంతో బ్యారేజీల మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు. ఐఐటీ బాంబే, ఇతర సాంకేతిక సంస్థల సహకారంతో పునరుద్ధరణ నమూనాలను సిద్ధం చేస్తున్నామని, రైతులకు సాగునీరు అందించేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగిస్తామని చెప్పారు. బ్యారేజీల్లో అవసరానికి మించి నీటిని నిల్వ చేయడం వల్ల కూడా సమస్యలు తలెత్తాయని పేర్కొన్న మంత్రి, మూడు బ్యారేజీల పరిస్థితిని సమగ్రంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ నెల 31న ఎన్డీఎస్ఏ, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), తరువాయి 2లో..



## బాక్సింగ్‌లో భారత్ పంచ్

- కామన్వెల్త్‌లో కొనసాగుతున్న భారత్ జైత్రయాత్ర

7



## మన్మోహన్‌కు సుప్రీం క్లీన్‌చిట్

- బొగ్గు బ్లాక్ కేటాయింపు కేసు ముగింపు
- సమన్ల ఉత్తర్వులు రద్దు
- సీబీఐ క్లోజర్ రిపోర్టును ఆమోదించిన ధర్మాసనం

6




## మోదీ పోస్టు వివాదం.. మెటా దిద్దుబాటు చర్యలు

- వీఐపీ ఖాతాలకు అదనపు భద్రతా వ్యవస్థ
- పోస్టులపై సీనియర్ అధికారుల పర్యవేక్షణ

6




## 2030 నాటికి 100 కోట్ల మందికి 5జీ

- రెండున్నరేళ్లలోనే 50 కోట్ల మందికి సేవలు
- టెలికాం రంగంలో భారత్ వేగవంతమైన ప్రగతి
- గ్వాలియర్‌లో దేశ తొలి టెలికాం తయారీ జోన్
- 6జీకి భారత్ సిద్ధం: సింధియా

6



## విద్యార్థులను వేధిస్తే ఊరుకోం

- పెల్లెట్ గన్ ప్రయోగానికి ఆదేశాలిచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ఉద్యమం మరింత ఉద్ధృతం
- సీజేపీ నేత అభిజీత్ దీప్కే

2

## మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు

- ఇరాన్ క్షిపణి దాడులు.. ఇరాక్‌లో మిలిషియా స్థావరాలపై అమెరికా–సౌదీ దాడులు
- చమురు ధరలకు రెక్కలు
- హార్ముజ్ జలసంధిపై కొనసాగుతున్న ఉద్రిక్తత

2

## పాకిస్థాన్ కశ్మీర్ కాదు.. పాక్ ఆక్రమిత కశ్మీర్

- న్యూయార్క్ టైమ్స్ కథనంపై భారత రాయబార కార్యాలయం అభ్యంతరం

6

# పోస్టల్ ఓట్లపై మళ్లీ వివాదం

- ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వుతో మెయిల్ బ్యాలెట్లపై ఉత్కంఠ
- పోస్టల్ జాప్యాలపై డెమొక్రాట్ల ఆందోళన
- ప్రత్యక్షంగా ఓటేయాలని కొన్ని రాష్ట్రాల సూచన

**వాషింగ్టన్:** అమెరికాలో మధ్యంతర ఎన్నికలకు సన్నాహాలు జరుగుతున్న వేళ పోస్టల్ ఓటింగ్ మరో సారి రాజకీయ వివాదానికి కేంద్రంగా మారింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెయిల్ బ్యాలెట్లపై నియంత్రణ పెంచేందుకు జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు, పోస్టల్ సర్వీస్‌లో ఇటీవల వచ్చిన మార్పులు ఎన్నికల నిర్వహణపై తీవ్ర చర్చకు దారితీశాయి. పోస్టల్ జాప్యాల వల్ల వేలాది బ్యాలెట్లు ఆలస్యంగా చేరుతున్నాయని డెమొక్రాట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెయిల్ బ్యాలెట్లు పొందే అర్హుల జాతీయ జాబితా రూపొందించాలని ట్రంప్ ఉత్తర్వులో ప్రతిపాదించారు. ఈ నిర్ణయంపై పలు రాష్ట్రాలు కోర్టులను ఆశ్రయించగా, ప్రస్తుతం ఈ వ్యవహారం అమెరికా సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది. మెయిల్ ఓటింగ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని ట్రంప్ ఆరోపిస్తుండగా, పరిశోధ నల ప్రకారం అలాంటి ఘటనలు అత్యంత అరుదుగా మాత్రమే నమోదవుతున్నాయి. ఈ ఏడాది కాలిఫోర్ని యా, విస్కాన్సిన్‌లో వేలాది పోస్టల్ బ్యాలెట్లు గడువు దాటిన తర్వాత ఎన్నికల కార్యాలయాలకు చేరడంతో లెక్కింపులో పరిగణించలేదు. దీంతో మిచిగన్, కాన్సాస్ రాష్ట్ర ఎన్నికల అధికారులు ముందస్తు ఓటర్లు పోస్టు ద్వారా కాకుండా నేరుగా డ్రాప్‌బాక్స్‌లు లేదా స్థానిక ఎన్నికల కార్యాలయాల్లో బ్యాలెట్లు సమర్పించాలని సూచిస్తున్నారు.

### పోస్టల్ సర్వీస్ వివరణ

తమ సేవలపై వచ్చిన విమర్శలను అమెరికా పోస్టల్ సర్వీస్ ఖండించింది. ఎన్నికల ప్రక్రియలో తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, గత ఎన్నికల్లో వచ్చిన 97.3 శాతం బ్యాలెట్లు గడువులోపే గమ్యస్థానాలకు చేరాయని వెల్లడించింది. ఓటర్లు తమ బ్యాలెట్లను గడువుకు కనీసం వారం ముందే పోస్టు చేయాలని మరోసారి సూచించింది.

### మెయిల్ ప్రాసెసింగ్ మార్పులపై విమర్శలు

ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో పోస్టల్ సర్వీస్ ప్రాంతీయ మెయిల్ ప్రాసెసింగ్ కేంద్రాలను ఏకీకృతం చేసింది. స్థానిక పోస్టాఫీసుల నుంచి రోజుకు ఒక్కసారి మాత్రమే మెయిల్ పంపడం వల్ల బ్యాలెట్ల పంపిణీలో జాప్యం ఏర్పడుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రక్రియపై దీని ప్రభావం పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు డెమొక్రాట్ సెనేటర్లు, గవర్నర్లు పోస్టల్ సర్వీస్‌ను కోరారు.

# ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి

**న్యూఢిల్లీ:** తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) సమర్థంగా పనిచేస్తున్నారని తెలంగాణ కాంగ్రెస్ సమన్వయ కమిటీ ప్రశంసించింది. ఇంకా నమోదు కాని అర్హులైన ఓటర్ల వివరాలను త్వరితగతిన నమోదు చేయాలని వారికి సూచించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్‌తో కూడిన సమన్వయ కమిటీ బుధవారం న్యూఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాల యంలో సమావేశమైంది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశం అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ప్రతి అర్హ పౌరుడు ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు.

# ఎడతెరిపిలేని వానలు

(మొదటిపేజీ తరువాయి)

కదులుతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో పాటు నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో రాష్ట్రంలో వచ్చే మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గడిచిన 24 గంటల్లో ములుగు, మెదక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 9.64 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా, ఎల్‌నినో ప్రభావంతో జూన్, జూలై నెలల్లో రాష్ట్రంలో సాధారణంతో పోలిస్తే 49 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

### మ్యాన్‌హోల్‌లో పడి వృద్ధుడు గల్లంతు

హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాలు మరో విషాదానికి దారితీశాయి. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ అండర్‌పాస్ సమీపంలో తెరిచి ఉంచిన మ్యాన్‌హోల్‌లో పడి 65 ఏళ్ల వృద్ధుడు గల్లంతైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాలయ్యగా గుర్తించిన వృద్ధుడు వర్షపు నీటిలో జారి మ్యాన్‌హోల్‌లో పడిపోయి ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆయన ఆచూకీ కోసం పోలీసులు, విపత్తు నిర్వహణ సిబ్బంది, ఇతర శాఖల బృందాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. మ్యాన్‌హోల్‌ను మూయకుండా వదిలేయడం వల్లే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపించారు. డ్రైనేజీ మరమ్మతు పనులను వర్షాకాలంలో కాకుండా ముందుగానే పూర్తి చేయాల్సిందని పేర్కొంటూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, మరమ్మతు పనులు జరుగుతున్న ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రహదారిని కూడా మూసివేసినట్లు పోలీసులు తెలిపారు.



## కడెం ప్రాజెక్టుకు భారీ వరద

- ఎగువ ప్రాంతాల నుంచి 21,583 క్యూసెక్కుల వరద ప్రవాహం
- మరో రెండు రోజుల్లో గేట్లు ఎత్తే అవకాశం
- దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. నిన్నటి వరకు వెలవెలబోయిన ప్రాజెక్టు ఇప్పుడు జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, బుధవారం సాయంత్రానికి నీటిమట్టం 688.60 అడుగులకు చేరుకుంది. మొత్తం 3.495 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం 1.409 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 21,583 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా, 67 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అవసరమైతే కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తే పరిస్థితి రావచ్చని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశమున్నందున దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నది పరివాహక ప్రాంతాల్లో రైతులు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు, ఇతరులు వరద ప్రవాహ ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరించారు.

# జీడీకే ఓసీపీ-5లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

**ప్రజానావ, రామగుండం:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు రామగుండం, గోదావరిఖని ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం చూపించాయి. లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకోగా, సింగరేణి రామగుండం ఏరియా–1 పరిధిలోని జీడీకే ఓసీపీ–5 ఓపెన్‌కాస్ట్ గనిలో భారీగా వరద నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా స్తంభించింది. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో గనిలో భారీగా నీరు నిలిచిపోవడంతో డంపర్లు, డోజర్లు, ప్రోక్లెయిన్లు సహా భారీ యంత్రాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఓవర్‌బర్డెన్ (ఓబీ) పనులు పూర్తిగా ఆగిపోవడంతో సింగరేణి సంస్థకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. గనిలో చేరిన వరద నీటిని భారీ మోటార్ల ద్వారా బయటకు పంపించే ప్రక్రియను యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తున్నామని, అయితే కొన్ని యంత్రాలు వరద నీటిలో మునిగిపోవడంతో అదనపు నష్టం సంభవించినట్లు వెల్లడించారు. సాధారణంగా ఓపెన్‌కాస్ట్ గనుల్లో భారీ వర్షాల సమయంలో బొగ్గు వెలికితీత పూర్తిగా నిలిచిపోవడం, మైన్ బెంచీలు నీటితో నిండిపోవడం, మైనింగ్ మార్గాలు బురదమయంగా మారడంతో భారీ డంపర్లు, యంత్రాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. నీటి మట్టం తగ్గిన తర్వాతే పూర్తిస్థాయిలో ఉత్పత్తి కార్యకలాపాలు పునఃప్రారంభం కానున్నాయి. ఇదిలా ఉండగా, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరడంతో ప్రాజెక్టు గేట్లను ఎత్తివేయగా, దిగువకు గోదావరిలోకి పెద్దఎత్తున నీరు విడుదలవుతోంది. గోదావరిఖని సమ్మక్క–సారలమ్మ ఘాట్ ప్రాంతంలో గోదావరి పరవళ్లు తొక్కుతుండగా, ముంపు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ వివరాల ప్రకారం మంగళవారం రాత్రి 122 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, బుధవారం సాయంత్రం వరకు మరో 68 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో గోదావరిఖని పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరిఖని సమీపంలోని పలు స్లమ్ ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# వందేమాతరానికి చట్టపరమైన రక్షణ

**న్యూఢిల్లీ:** జాతీయ గేయం వందేమాతరంకు చట్టపరమైన రక్షణ కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై బుధవారం చర్చ అనంతరం ఆమోదం లభించింది. ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్–1971లో సవరణలు చేస్తూ వందేమాతరానికీ ప్రస్తుతం జాతీయ గీతం జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను వర్తింపజేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. వందేమాతరాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించడం లేదా ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించడం నేరంగా పరిగణించేలా బిల్లులో నిబంధనలు చేర్చారు. బిల్లు ప్రకారం వందేమాతరాన్ని అవమానించినట్లు తేలితే నిందితులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జాతీయ గౌరవాన్ని పరిరక్షించడమే ఈ చట్టం ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది.

# మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు

- ఇరాన్ క్షిపణి దాడులు.. ఇరాక్‌లో మిలీషియా స్థావరాలపై అమెరికా–సౌదీ దాడులు
- చమురు ధరలకు రెక్కలు
- హార్ముజ్ జలసంధిపై కొనసాగుతున్న ఉద్రిక్తత

**కైరో:** మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా బలగాలపై ఇరాన్ క్షిపణి దాడులు చేయగా, ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల మిలీషియా స్థావరాలపై అమెరికా, సౌదీ అరేబియా సంయుక్తంగా వైమానిక దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో కనీసం 20 మంది మిలీషియా సభ్యులు మృతి చెందగా, ఆరుగురు ఇరాన్ సైనిక సలహాదారు లు కూడా మరణించినట్లు సమాచారం. ఐదు నెలలు గా కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో తాజా పరిణామాలు మరోసారి ఉద్రిక్తతలను పెంచాయి. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ జోర్డాన్‌లోని మువాఫాక్ సాల్టి వైమానిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించినట్లు ప్రకటించింది. ఈ స్థావరం అమెరికా సైనిక కార్యకలాపాలకు కీలక కేంద్రంగా ఉంది. అయితే జోర్డాన్ సైన్యం ఐదు ఇరాన్ క్షిపణుల ను అడ్డుకుని ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని తెలిపింది.

### ఇరాక్‌లో మిలీషియాపై ప్రతిదాడి

సౌదీ అరేబియా చమురు కేంద్రాలపై డ్రోన్ దాడులకు ప్రతిస్పందనగా అమెరికా, సౌదీ యుద్ధ విమానాలు ఇరాక్ తూర్పు ప్రాంతాల్లోని ఆయుధ నిల్వలు, సరఫరా కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న 'పాపులర్ మొబిలైజేషన్ ఫోర్సెస్' ఈ దాడుల్లో 20 మంది మృతి చెందగా, 32 మంది గాయపడ్డారని ప్రకటించింది. ఇరాక్ ప్రభుత్వం ఈ దాడులను ఖండిస్తూ తమ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించారని పేర్కొంది. ఇదిలాఉంటే మధ్యప్రాచ్య ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ చమురు ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ధర 3.1 శాతం పెరిగి బ్యారెల్‌కు 84.58 డాలర్లకు చేరుకుంది. మరోవైపు సౌదీ చమురు మౌలిక వసతులపై హౌతీ తిరుగుబాటుదారుల దాడులు ప్రపంచ ఇంధన సరఫరాపై ఆందోళనలను పెంచుతున్నాయి.

### హార్ముజ్‌పై కొనసాగుతున్న వివాదం

ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి మరోసారి ఉద్రిక్తతలకు కేంద్రంగా మారింది. జలసంధిలో నౌకా రాకపోకలను సంయుక్తంగా నిర్వహించాలన్న ఒమన్ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది. యుద్ధానికి ముందు ఉన్న స్వేచ్ఛాయుత రవాణా పరిస్థితులు తిరిగి రావద్దని పేర్కొన్న ఇరాన్, తన ప్రాదేశిక జలాల మీదుగా నౌకల రాకపోకలకు తాత్కాలిక ప్రణాళికను ప్రతిపాదించింది. మరోవైపు అమెరికా, ఇరాన్‌ల మధ్య చర్చలు పునరుద్ధరించేందుకు మధ్యవర్తుల ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ తాజా దాడులు శాంతి ప్రక్రియకు ప్రతికూలంగా మారాయి.

# హరిత విమానయానానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

- తుది దశలో సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ విధానం
- 2027 కార్సియా అమలుకు ముందే పూర్తి సన్నద్ధత లక్ష్యం

**న్యూఢిల్లీ:** దేశంలో హరిత విమానయానానికి ఊతమిచ్చే సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (ఎస్ఏఎఫ్) వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు బుధవారం వివిధ శాఖలు, పరిశ్రమల ప్రతినిధులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, ఎస్ఏఎఫ్ అమలుకు సంబంధించిన సన్నద్ధతతో పాటు అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏఓ) రూపొందించిన కార్బన్ ఆఫ్‌సెట్టింగ్ అండ్ రిడక్షన్ స్కీమ్ ఫర్ ఇంటర్నేషనల్ ఏవియేషన్ (కార్సియా) అమలుపై పురోగతిని పరిశీలించారు. ఎస్ఏఎఫ్ విధానం ముసాయిదా ప్రస్తుతం తుది దశలో ఉందని మంత్రి తెలిపారు. వివిధ మంత్రిత్వ శాఖలు, పరిశ్రమల భాగస్వాములతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రయాణికులు, విమానయాన సంస్థలపై అదనపు ఆర్థిక భారం పడకుండా, ఉత్పత్తి నుంచి విమానాశ్రయాల వరకు అత్యంత వ్యయసరళిలో ఇంధన సరఫరా జరిగేలా అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

### ఉత్పత్తి నుంచి సరఫరా వరకు సమీక్ష

దేశంలో ఎస్ఏఎఫ్ ఉత్పత్తి, నాణ్యత ధ్రువీకరణ, సరఫరా వ్యవస్థ అభివృద్ధి పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. 2027 జనవరి 1 నుంచి కార్సియా నిబంధనల అమలు తప్పనిసరి కానున్న నేపథ్యంలో, ఆ గడువుకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖలు, సంస్థలకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో పౌర విమానయానం, పెట్రోలియం, పర్యావరణ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులతో పాటు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్), బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ), చమురు మార్కెటింగ్ సంస్థలు, విమానయాన సంస్థలు, విమానాశ్రయ నిర్వాహకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

- ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**న్యూఢిల్లీ:** తెలంగాణలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు)కు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్రంలోని ప్రతి అర్హ పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, బీఎల్ఏలు ఇప్పటివరకు సమర్థంగా పనిచేశారని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులతో సంప్రదింపులు జరిపి, ముగ్గురు పేర్లతో కూడిన ప్యానెల్‌ను సిద్ధం చేసి పార్టీ అధిష్ఠానానికి నివేదిక అందజేయాలని నిర్ణయించినట్లు భట్టి వెల్లడించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను సమీక్షించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 36 వేల మంది బీఎల్ఏలను నియమించామని, ఇప్పటివరకు 50 నుంచి 60 శాతం ప్రక్రియ పూర్తైందన్నారు. మరో రెండు మూడు రోజుల్లో 100 శాతం పూర్తి చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించడమే కాంగ్రెస్ లక్ష్యమని, ఎలాంటి ఓటు తొలగింపులు జరగకుండా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

# అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలి

- విద్యార్థులపై పోలీసుల దారుణాలపై సుప్రీం పర్యవేక్షణలో విచారణ జరపాలి
- పెల్లెట్ గన్స్ వినియోగానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ అగ్రనేత: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ:** విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాల అంశంపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగం, లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరగాలని కోరారు. లోక్‌సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని రాహుల్ ఆరోపించారు. తాను ప్రతిసారి ప్రజా సమస్యలు లేవనెత్తేందుకు ప్రయత్నిస్తే అడ్డుకుంటున్నారని, కేంద్ర మంత్రులు మాట్లాడేందుకు అవకాశం ఇస్తున్నప్పటికీ తనను మాత్రం ఉద్దేశపూర్వకంగా మౌనం పాటించేలా చేస్తున్నారని విమర్శించారు.

### షా బాధ్యత వహించాల్సిందే

జూలై 20న పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను ప్రస్తావిస్తూ, పెల్లెట్ గన్స్ ప్రయోగించాలంటూ అమిత్ షా ఆదేశాలు ఇచ్చి ఉంటే ఆయన బాధ్యుడేనని, ఆదేశాలు ఇవ్వకపోయినా జరిగిన విషయం తెలియకపోతే ఆయన అసమర్థుడని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ రెండు పరిస్థితుల్లోనూ హోంమంత్రిగా కొనసాగేందుకు నైతిక హక్కు లేదన్నారు. అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెబితే మాట్లాడే అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే బీజేపీ–ఆర్ఎస్ఎస్‌కు తాను ఎప్పటికీ క్షమాపణ చెప్పబోనని రాహుల్ స్పష్టం చేశారు. దేశానికి సంబంధించిన కీలక అంశాలను లేవనెత్తడం ప్రతిపక్ష నేతగా తన హక్కు అని అన్నారు.

### విద్యార్థులకు న్యాయం చేస్తాం

విద్యార్థులపై జరిగిన దాడులకు బాధ్యులైన అధికారులను కఠినంగా శిక్షించాలని రాహుల్ డిమాండ్ చేశారు. దాడులకు గురైన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ పోరాడుతుందని, పోలీసు దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ నిర్వహించాలని ఆయన కోరారు.

### రాహుల్ వ్యాఖ్యలతో లోక్‌సభలో దుమారం

విద్యార్థుల ఆందోళన, ప్రశ్నపత్రాల లీకేజీ అంశాలపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ప్రజా పరీక్ష ల్లో అక్రమాల నిరోధానికి సంబంధించిన సవరణ బిల్లుపై చర్చలో పాల్గొన్న ఆయన, కేంద్ర ప్రభుత్వ తీరుతో పాటు ఆర్ఎస్ఎస్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు చేశారు. పేపర్ లీక్ ఘటనలతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని, శాంతియుతం గా నిరసన తెలిపిన వారిపై పోలీసులు అనవసరంగా కఠినంగా వ్యవహరించారని రాహుల్ ఆరోపించారు. విద్యా వ్యవస్థలో ప్రైవేటీకరణ పెరిగిందని, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎంపీ లను అవమానించేలా మాట్లాడారని ఆరోపిస్తూ ఆ వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొల గించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందిం చిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, అమిత్ షాపై చేసిన ఆరోపణలకు రాహుల్ ఆధారాలు చూపాలని స్పష్టం చేశారు.

# విద్యార్థులను వేధిస్తే ఊరుకోం

**సీజేపీ నేత అభిజీత్ దీప్కే**

ముంబై: విద్యార్థులు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తు వారేనని 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జూలై 20న విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు ప్రయోగించేందుకు ఆదేశాలు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై పోలీసుల వేధింపులు కొనసాగితే ప్రభుత్వం మార్పుకు యువతే కారణమవుతుందని హెచ్చరించారు. న్యూఢిల్లీలో నెల రోజుల పాటు సాగిన నిరసనల అనంతరం స్వస్థలానికి చేరుకున్న దీప్కే.. పలు రాష్ట్రాల్లో విద్యార్థి కార్యకర్తల ఇళ్లకు పోలీసులు వెళ్లి అరెస్టుల పేరుతో బెదిరిస్తున్నారని ఆరోపించారు. జూలై 20న పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై జరిగిన చర్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. విద్యార్థుల రక్తం రోడ్డుపై చిందింది. అయినా వారిని ఇంకా వేధించడం సరికాదు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలి అని ఆయన వ్యాఖ్యానించారు.

### ఆదేశాలిచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులపై పెల్లెట్ గన్‌ల వినియోగానికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దీప్కే డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అయినా, మరెవరైనా బాధ్యులైతే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల ఆగ్రహం తగ్గలేదని, అవసరమైతే మరింత పెద్ద స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సాగిన ఉద్యమం ఫలితంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని దీప్కే పేర్కొన్నారు. దాదాపు 36 రోజుల పాటు ఎండ, వానలను లెక్కచేయకుండా విద్యార్థులు పోరాడారని, ఇది యువత విజయమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారితే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

### పేపర్ లీక్ చట్టంపై విమర్శలు

పేపర్ లీక్‌లను అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టంలో కఠిన నిబంధనలు ఉన్నా, వాటిని అమలు చేసే వ్యవస్థలో మార్పు అవసరమని దీప్కే అన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల హామీ ఇచ్చినా, కేసుల విచారణ ప్రారంభ దశలోనే ఆలస్యం జరుగుతోందని విమర్శించారు. విద్యార్థులపై ఒత్తిడి కొనసాగితే ప్రభుత్వం వ్యతిరేకంగా మరోసారి ఉద్యమం తప్పదని ఆయన స్పష్టం చేశారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్

### మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఫిర్యాదుతో అరెస్ట్

**ప్రజానావ, హైదరాబాద్:** తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, భౌతిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్టు చేసి ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతడికి ఆగస్టు 11 వరకు 14 రోజుల రిమాండ్ విధించగా, అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. బాధిత అధికారిణికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో భౌతిక దాడి జరిగినట్లు నిర్ధారణ అయినట్లు సమాచారం. గొంతు, చెంప, కాలిపై గాయాల ఆనవాళ్లు ఉన్నట్లు వైద్య నివేదికలో నమోదైంది. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం, నిందితుడు వాట్సాప్ ద్వారా లైంగిక వేధింపులు, వ్యక్తిగత వీడియోలతో బెదిరింపులు, అసత్య ప్రచారం, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఈ నెల 9న గదిలో బంధించి జుట్టు లాగడం, గొంతు నులిమేందుకు ప్రయత్నించడం, కత్తితో బెదిరించడం, మరుసటి రోజు భౌతిక దాడి చేసినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఆవును కాపాడబోయి బాలుడి మృతి

లక్నో: మూగజీవాన్ని కాపాడే ప్రయత్నం చేసిన ఓ 12 ఏళ్ల దివ్యాంగ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఏటా జిల్లాలో బుధవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జలేసర్ ప్రాంతంలోని దౌలత్‌పూర్ ముస్కీ గ్రామానికి చెందిన ఆదిత్య అనే బాలుడు మరికొందరు పిల్లలతో కలిసి ఓ వీధి ఆవును గోశాలకు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో సమీపంలోని కళాశాల వద్ద ఉన్న చెరువులోకి ఆవు వెళ్లింది. ఆవును బయటకు తీసుకువచ్చేందుకు ఆదిత్య చెరువులోకి దిగాడు. అయితే లోతైన నీటిలో కాలు జారి మునిగిపోయాడు. వెంట ఉన్న పిల్లలు కేకలు వేయడంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

# పోలీసు శాఖలో 7,437 ఉద్యోగాలు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ పోలీసు శాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీసు నియామక మండలి నాలుగు నోటిఫికేషన్లు విడుదల చేసింది. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్), జైళ్లు, అగ్నిమాపక శాఖల్లో ఈ నియామకాలు చేపట్టనున్నారు. నోటిఫికేషన్ ప్రకారం సివిల్ కానిస్టేబుల్ 3,697, ఏఆర్ కానిస్టేబుల్ 1,052, ఎస్పీఎఫ్‌లో ఎస్ఐ 44, కానిస్టేబుల్ 1,380, ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ రైడర్ 751, జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు నియామ క మండలి తెలిపింది. దరఖాస్తుల ప్రారంభ, ముగింపు తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందు నోటిఫికేషన్‌లో పేర్కొన్న శారీరక, వైద్య ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నారో లేదో సివిల్ సర్జన్‌తో పరీక్ష చేయించుకోవాలని, అలాగే ఎస్సీ అభ్యర్థు లు ఉపకుల వర్గీకరణ వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొంది.

# కాళేశ్వరంపై బీఆర్ఎస్ మాట్లాడటం సిగ్గుచేటు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. హైడ్రా అంశంపై స్పందిస్తూ, అది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిధిలోని శాఖ అని, ఆ అంశంపై తుది నిర్ణయం ముఖ్యమంత్రే తీసుకుంటారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.



# కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయంలో తనిఖీ

- స్వచ్ఛ భారత్ సందేశాలతో గోడలపై ఆకర్షణీయ చిత్రాలు వేయించాలి
- కమిషనర్ వెంకన్న

**ప్రజానావ, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలోని కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాన్ని కమిషనర్ టి. వెంకన్న బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ ఆవరణలోని గోడలపై స్వచ్ఛతను చాటిచెప్పేలా 'స్వచ్ఛ భారత్' సందేశాలతో ఆకర్షణీయమైన చిత్రాలు వేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలోని ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, బర్త్ అండ్ డెత్ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆయా విభాగాల్లో జరుగుతున్న పనితీరుపై అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బర్త్ అండ్ డెత్ విభాగాన్ని సందర్శించి జనన, మరణ నమోదు వివరాలను ఆన్‌లైన్‌లో ఏ విధంగా నమోదు చేస్తున్నారో పరిశీలించారు. నమోదు ప్రక్రియకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. తర్వాత కార్యాలయ ఆవరణలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న షట్టర్ల నిర్వహణపై డిప్యూటీ కమిషనర్‌తో చర్చించారు. షట్టర్ల పరిసర గోడలపై స్వచ్ఛతపై అవగాహన కల్పించేలా అందమైన పెయింటింగ్‌లు వేయించి 'స్వచ్ఛ భారత్' సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా బాధ్యతాయుతంగా, నిబద్ధతతో విధులు నిర్వహించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఏసీపీ ఖలీల్, సూపరింటెండెంట్ రామకృష్ణతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిరిసిల్ల మార్కెట్‌లో ఘనంగా బోనాల వేడుకలు

**భారీగా పాల్గొన్న కూరగాయల విక్రయదారులు**

**ప్రజానావ, సిరిసిల్ల :** ఆషాఢ మాసం సందర్భంగా బుధవారం సిరిసిల్ల కూరగాయల మార్కెట్ లో బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని అమ్మవారిని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో 20 వ వార్డు కౌన్సిలర్ కూరపాటి శ్రీశైలం, కూరగాయల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి, బత్తుల భూమేష్, గుర్రాల నర్సింలు, తడక రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

- వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయొద్దు
- ములుగు డీఎస్పీ రవీందర్
- మేడారం జంపన్న వాగు పరివాహక ప్రాంతాల పరిశీలన
- పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి




**ప్రజానావ, తాడ్వాయి:** భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు, లోతట్టు ప్రాంతాలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని ములుగు డీఎస్పీ రవీందర్ సూచించారు. బుధవారం మేడారం జంపన్న వాగు పరివాహక ప్రాంతాలను మేడారం ఎస్ఐ కమలాకర్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, రహదారులపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దని ప్రజలకు హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వరద నీటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులు, పశువుల కాపరులు వర్షం కురుస్తున్న సమయంలో పిడుగుల ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని చెట్ల కింద నిలబడకుండా సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలని, ఎక్కడైనా రహదారులు దెబ్బతినడం, చెట్లు కూలిపోవడం, వరద నీరు చేరడం లేదా రహదారులపై నీరు ప్రవహించడం వంటి పరిస్థితులు ఎదురైతే అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించి పూర్తి సహకారం అందించాలని కోరారు. ములుగు జిల్లా పోలీసు సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండి నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రజలందరూ పోలీసు శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటిస్తూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతకు సహకరించాలని డీఎస్పీ రవీందర్ విజ్ఞప్తి చేశారు.

# మక్తల్‌లో వీధి కుక్కల వీరంగం

- ఒక్కరోజే ఏడుగురిపై దాడులు.. పలువురికి తీవ్ర గాయాలు
- మహేశ్వరి, బాల్‌రాజ్‌పై దాడి
- బాధితులకు జిల్లా ఆసుపత్రిలో చికిత్స
- వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజల డిమాండ్







**ప్రజానావ, మక్తల్:** మక్తల్ పట్టణంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. బుధవారం ఒక్కరోజే ఏడు మందికి పైగా వీధి కుక్కల దాడికి గురికావడంతో పట్టణ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. 16వ వార్డు అనంపల్లి వీధిలో మహేశ్వరి అనే మహిళపై వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా కరిచింది. ఆ సమయంలో ఆమె సమీపంలో ఉన్న చిన్నారులను ముందుగా సురక్షితంగా పక్కకు పంపించిన అనంతరం కుక్క ఆమెపై దాడి చేయడం స్థానికంగా కలకలం రేపింది. ఇదే కుక్క పతంజలి షాపునకు చెందిన బాల్‌రాజ్‌పై కూడా దాడి చేసి మూడు చోట్ల కరిచినట్లు స్థానికులు తెలిపారు. మహేశ్వరి, బాల్‌రాజ్‌తో పాటు మరికొందరు బాధితులను మెరుగైన చికిత్స కోసం నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. వరుసగా వీధి కుక్కల దాడులు జరగడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై స్పందించిన బీజేపీ మక్తల్ టౌన్ కార్యదర్శి బ్యాటరీ రాజు మున్సిపల్ కమిషనర్ రాజయ్యకు ఫోన్ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఈ అంశాన్ని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గత ఏడాది కాలంగా వీధి కుక్కల సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమయ్యారని, కేవలం హామీలకే పరిమితమయ్యారని బ్యాటరీ రాజు విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ స్పందించి అమాయక ప్రజలు, విద్యార్థులు, చిన్నారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా వీధి కుక్కల సమస్యకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# జలసిరి విజయానికి ప్రజల భాగస్వామ్యం అవసరం

- నీటి సంరక్షణతోనే భవిష్యత్ తరాలకు భరోసా: అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు
- ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలి



**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా చేపడుతున్న 'జలసిరి' కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం గుండాల మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన, రాబోయే రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టడం అత్యవసరమని తెలిపారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత–ప్రతి రైతుకు పంటకుంట–ప్రతి ఊరికి ఊటకుంట లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు, ప్రతి వ్యవసాయ పొలంలో పంటకుంటలు, బోర్‌వెల్ రీచార్జ్ పిట్స్, గ్రామాల్లో సోక్‌పిట్స్ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు జలసిరి కార్యక్రమంలో చురుకుగా పాల్గొని నీటి సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా సౌర విద్యుత్ వినియోగంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి వేడుకల్లో మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



**ప్రజానావ, ఖైరతాబాద్ :** ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఫిల్మ్‌నగర్ శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో జూబ్లీహిల్స్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పాల్గొని శ్రీ షిర్డీ సాయిబాబా వారి దర్శనం చేసుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు స్వీకరించి, స్వామివారికి పుష్పమాలలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వెల్దండ వెంకటేష్ మాట్లాడుతూ సద్గురు షిర్డీ సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, గురు పౌర్ణమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో ఆధ్యాత్మిక వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. భక్తులందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు, స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు.

# ఫేక్ ట్రేడింగ్ యాప్ కేసు.. గూగుల్ అధికారిపై కేసు

- ప్లే స్టోర్‌ను నమ్మి రూ.7.95 లక్షలు పోగొట్టుకున్న రక్షణ ఉద్యోగి
- యాప్ పర్యవేక్షణలో నిర్లక్ష్యంపై సైబరాబాద్ సైబర్ క్రైం చర్యలు

**ప్రజానావ, హైదరాబాద్:** గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న నకిలీ ట్రేడింగ్ యాప్ ద్వారా రక్షణ రంగ ప్రభుత్వ సంస్థ ఉద్యోగి రూ.7.95 లక్షలు మోసపోయిన ఘటనలో గూగుల్ ఇండియా నోడల్ అధికారిపై సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. యాప్ విషయంలో తగిన పర్యవేక్షణ లేకపోవడంతో నిర్లక్ష్యం జరిగిందనే ఆరోపణలపై ఈ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వివరాలు వెల్లడించారు. జూలైలో కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా తనను సంప్రదించి, ట్రేడింగ్ యాప్‌లో ఖాతా తెరిచి పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వారి సూచనల మేరకు యాప్ ద్వారా వివిధ బ్యాంకు ఖాతాలకు రూ.7.95 లక్షలు బదిలీ చేసినట్లు తెలిపాడు. యాప్‌లో పెట్టుబడులు పెరుగుతు న్నట్లు, లాభాలు వస్తున్నట్లు చూపించారని, అయితే డబ్బు వెనక్కి తీసుకునే ప్రయత్నం చేయగా ఉపసంహరణను నిలిపివేసి 'విత్‌డ్రా ట్యాక్స్' పేరుతో మరింత మొత్తం చెల్లించాలని కోరినట్లు వివరించాడు.

## ప్లే స్టోర్‌లో ఉండడంతో నమ్మకం

సదరు ట్రేడింగ్ యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉండటంతో అది నమ్మకమైనదేనని భావించి పెట్టుబడి పెట్టినట్లు బాధితుడు పోలీసులకు తెలిపాడు. అనంతరం అది నకిలీ యాప్ అని గుర్తించి మోసపోయినట్లు పేర్కొన్నాడు. ఫిర్యాదు ఆధారంగా నిర్లక్ష్యం ఆరోపణలపై కేసు నమోదు చేసి, గూగుల్ ఇండియా నోడల్ అధికారిని నిందితుల జాబితాలో చేర్చినట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఈ వ్యవహారంపై గూగుల్ నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన రాలేదు. ఇటీవల హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఇలాంటి మూడు వేర్వేరు సైబర్ మోసాల కేసుల్లో గూగుల్ ఇండియా అధిపతిని సహ నిందితుడిగా చేర్చారు. అధిక రాబడుల పేరుతో నకిలీ పెట్టుబడి యాప్‌లను డౌన్‌లోడ్ చేయించి మోసాలకు పాల్పడ్డారని బాధితులు ఫిర్యాదు చేశారు. గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్‌లు అందుబాటులో ఉండటంతో అవి అసలైనవేనని నమ్మి పెట్టుబడులు పెట్టామని బాధితులు పేర్కొన్నారు. ఈ కేసుల్లో ఐటీ చట్టం, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద పోలీసులు చర్యలు చేపట్టారు.

## నకిలీ యాప్‌లపై దర్యాప్తు

పెట్టుబడి యాప్‌ల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో జూలై 22న గూగుల్ దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపింది. ఫిర్యాదుల్లో పేర్కొన్న యాప్‌లలో ఒకటి మాత్రమే ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉందని, అది తమ ఆర్థిక సేవల విధానాలకు అనుగుణంగా ఉందని గుర్తించినట్లు సంస్థ వెల్లడించింది.

# గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

- ఉత్పాదక సామర్థ్యం మెరుగు పర్చాలి
- చక్కెర పరిశ్రమల పునరుద్దరణ కమిటీతో సిఎస్ చర్చలు

**ప్రజానావ, హైదరాబాద్ :** రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో షుగర్ పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు పంట విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం గురువారం సచివాలయం లో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నా రు. సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం 7 కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పని చేస్తున్న పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయా లంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో వలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు. రి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరగడం తో పాటు సాగు వ్యయం డా తగ్గుతుందని పేర్కొన్నారు. 2026?27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు తెలిపారు. చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేం దుకు, చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు లభ్యతను మెరుగుపరచేందుకు ఇతర రాష్ట్రా ల్లో అమలు చేస్తున్న ప్రోత్సాహకాలు, విధానాలను సమ గ్రంగా అధ్యయనం చేసి నివేదికను తక్షణమే సమర్పిం చాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. మావేశంలో రైతు ప్రతినిధులు మాట్లాడుతూ, చెరకు రైతులకు కూడా వరి రైతులకు అం దిస్తున్న తరహాలో టన్నుకు రూ.500 ప్రోత్సాహకం అందించాలని కోరారు. చెరకు సాగులో అధిక పెట్టుబడి, వ్యవసాయ లీల కొరత రైతులకు ప్రధాన సవాళ్లుగా మారాయని వివరించారు. చెరకు ద్వారా చక్కెరతో పాటు ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తి డా సాధ్యమవుతుందని పేర్కొంటూ, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.





సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గారిని పరామర్శించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఆయనకు అందిస్తున్న వైద్యం గురించి, ప్రస్తుత ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్న టీఆర్ఎస్ చీఫ్.. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి గారి భార్య, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన తెలంగాణ రక్షణ సేన చీఫ్

– ప్రజానావ, సికింద్రాబాద్

# పులుల సంరక్షణ మన బాధ్యత

- భూమ్మీద జీవించే హక్కు సమస్త జీవరాశులది
- అంతర్జాతీయ పులుల దినోత్సవ కార్యక్రమంలో మంత్రి సురేఖ

**ప్రజానావ, హైదరాబాద్ :** హైదరాబాద్ పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముం దుకు రావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించు కుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జా తీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరెక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010 లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్‌లో ప్రారంభ మైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంప దకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్య త్తును పరిరక్షించడమేనని అన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటి సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాటి ప్రధాని ఇందిరా గాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో 'ప్రాజెక్ట్ టైగర్'ను ప్రారంభించి దేశవ్యాప్తం గా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ చర్యల ఫలితంగానే నేడు భారత దేశం ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలి చిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయని, దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కూడా ఈ విషయంలో విశిష్టమైన స్థానం ఉందని మంత్రి అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన పులుల అభయార ణ్యాలుగా గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా పులుల సంరక్షణకు అటవీ శాఖతో పాటు, ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ గారు పిలుపునిచ్చారు. ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, రళ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులను ఉద్దేశించి 'అటవీ సంపదను పరిరక్షించడంలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పనిచేసి భావి తరాలకు పచ్చని తెలంగాణను అందించాలి' అని మంత్రి దిశా నిర్దేశం చేశారు. అదే విధంగా అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రాలేఖన పోటీలో గెలిచిన విద్యార్థులకు మంత్రి సురేఖ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.



# వేములవాడలో ఘనంగా మారుతి సాగర్ జన్మదిన వేడుకలు

**పేదలకు అన్నదానం, రోగులకు పండ్ల పంపిణీ**

**ప్రజానావ, వేములవాడ:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ జన్మదిన వేడుకలను బుధవారం వేములవాడ పట్టణంలో ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మారుతి సాగర్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సమీపంలో పేదలకు అన్నదానం చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం భాస్కర్ రెడ్డి, మాకాసి కార్తీక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# పరీక్షల బిల్లుతో సమస్య సమసిపోయేనా?

**కాక్రోచ్ ఉద్యమాన్ని ముందుసుకుని ప్రభుత్వాన్ని తూర్పారాబట్టడం మాత్రమే చేస్తున్నారు. పరీక్షలను ఎలా పకడ్బందీగా ఎలా నిర్వహించాలో నిర్మాణాత్మక సూచనలు చేయలేదు. ప్రభుత్వం డా ఎంతసేపు శిక్షలపైనే దృష్టి పెట్టింది తప్ప, పరీక్షలను పక్కాగా నిర్వహించడం ఎలా అన్నదానిపై దృష్టి సారించడం లేదు. నిజంగానే ఆదరాబాదరాగా తెచ్చిన ఈ బిల్లులో కఠిన శిక్షలతో పాటు, పరీక్షలను సంస్కరించే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. నీట్ పరీక్ష పేపర్ లీజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది.**

పిల్లికి చెలగాటం... ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా మన పరీక్షల విధానం మారింది. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్షల లీక్‌తో మన పరీక్షల విధానం ఎంత డొల్లగా ఉందో తేలిపోయింది. డబ్బులకు కక్కుర్తి పడే లెక్చరర్లు ఉండడం దౌర్భాగ్యం. విద్యార్థులు ఏమైతేనేవు మనకు కాసులు రాలుతున్నాయని పేపర్లను లీక్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలి నీట్ పేపర్ లీక్‌తో కాక్రోచ్ పార్టీ ఉద్యమించడం, అంతే స్పీడ్‌గా ఇప్పుడు పార్లమెంటులో పేపర్ లీక్ నిరోధక బిల్లుపై చర్చ సాగుతోంది. ఈ చర్చలో గమనించిన విషయమేమిటంటే విపక్షాలకు కూడా పకడ్బందీ విధానం ఎలా అమలు చేయాలన్న దానిపై అవగాహన లేదని తేలిపోయింది. చర్చలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, గగోయ్, అఖిలేశ్ యాదవ్‌లు విమర్శలు చేశారే తప్ప పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అసవరమైన సూచనలు చేయలేక పోయారు. కాక్రోచ్ ఉద్యమాన్ని ముందుసుకుని ప్రభుత్వాన్ని తూర్పారాబట్టడం మాత్రమే చేస్తున్నారు. పరీక్షలను ఎలా పకడ్బందీగా ఎలా నిర్వహించాలో నిర్మాణాత్మక సూచనలు చేయలేదు. ప్రభుత్వం డా ఎంతసేపు శిక్షలపైనే దృష్టి పెట్టింది తప్ప, పరీక్షలను పక్కాగా నిర్వహించడం ఎలా అన్నదానిపై దృష్టి సారించడం లేదు. నిజంగానే ఆదరాబాదరాగా తెచ్చిన ఈ బిల్లులో కఠిన శిక్షలతో పాటు, పరీక్షలను సంస్కరించే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. నీట్ పరీక్ష పేపర్ లీజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే మంత్రి రాజీనామాతోనే భ్రష్టుపట్టిన మన దేశ విద్యా వ్యవస్థ మారిపోదు. పరీక్ష పేపర్ లీజీలు, అవకతవకలు, అవినీతి వంటి సమస్యలు తొలగిపోవాటంలే పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ఎందుకంటే పేపర్ లీజీలకు మూలం డబ్బుల మాయగా ఉంది. ఈజీగా డబ్బు సంపాదించే క్రమంలో ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. మెడికల్ కాలేజీల ప్రవేశానికి లక్షల మంది రాసే పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చట్టబద్ధతను సమీక్షించాలి. వాస్తవానికి ఎన్టీఏ అనేది ఒక అకడమిక్ బాడీ కూడా కాదని ఎంత మందికి తెలుసు. ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పాటైన సంస్థ అంతకన్నా కాదు. వలం కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ మాత్రమే అని ఇక్కడ గుర్తించాలి. దానికంటూ స్వతంత్రత, స్వయంప్రతిపత్తి ఏమీ లేవు. అలాంటి సంస్థకు దేశంలోని నీట్‌తో సహా అనేక ప్రవేశ పరీక్షలను, పోటీ పరీక్షలను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ఈ కారణంగా దేశ విద్యారంగాన్నంతా కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి తెచ్చుకునే అధికారాల కేంద్రీకరణ విధానం. అందువల్లనే పరీక్షలలో అక్రమాలు, అవకతవకలు, అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయి. నీట్ కోచింగ్ సెంటర్స్‌ను నిర్వహిస్తున్న వారే నీట్ పేపర్ సెట్టర్స్‌గా అవతారమెత్తారంటే ఎన్టీఏ కేంద్రంగా కోచింగ్ మాఫియా ఏ స్థాయిలో బలంగా వేళ్లానుకుందో చెప్పవచ్చు. ఈ విధమైన వేల కోట్ల రూపాయల అవినీతి వ్యాపారం సాగుతుఓంది. అధికారుల అండదండలు లేకుండా ఇది జరు9గుతందని అనుకోవడానికి లేదు. అందువల్ల ఈ ఎన్‌టిఏ స్థానంలో ప్రస్తుతం బిల్లు ఏ ర కంగా ఉంటుందో తెలియదు. పార్లమెంటులో చర్చ సాగుతున్నా సీరియస్నెస్ కానరావడం లేదు. బిల్లులో కేంద్రాన్ని విమర్శించడం తప్ప నిర్మాణాత్మక సూచనలు చేయడంలో విపక్ష పార్టీలు విఫలం అయ్యాయి. కావున ఎన్టీఏ ఉనికిని, దాని చుట్టూ బలంగా అల్లుకొని ఉన్న అవినీతి చట్రాన్ని బ్రద్దలు కొట్టాలి. లేదంటే కంటితుడుపు చర్యగా పేపర్ లీజీలో దళారి పాత్ర పోషించిన కొద్దిమంది నేరస్తులను బలి ఇవ్వడం, ఎన్టీఏలోని కొద్దిమంది అధికారులను తొలగించడం వంటి కసరత్తుగా మిగిలి పోతుంది. ఇంత ఆగ్రహం, ఆందోళన చెలరేగిన నేపథ్యంలో అసమర్థ ఎన్టీఏను రద్దుచేసి, తిరిగి రాష్ట్రాల స్థాయిలోనే మెడికల్ అడ్మిషన్స్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహించాలనే డిమాండ్‌ను కూడా పునఃపరిశీలించడం అవసరం. ఉమ్మడి జాబితాలోని విద్యపై రాష్ట్రాల హక్కులను హరిస్తున్న, రాజ్యాంగ ఫెడరల్ సూత్రాలను కాలరాస్తున్న విద్యా ంద్రీకరణ విధానానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. పేపర్ లీజి సమస్య అనేది నేడు కొత్తగా తలెత్తినది కాదు. గతంలో డా మెడికల్, ఇంజినీరింగ్, వంటి కోర్సులకు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలలోనూ అక్రమాలు, అవకతవకలు, లీజీలు చోటుచేసుకున్నాయి. చదువులంటే మెడికల్, ఇంజినీరింగ్, కంప్యూటర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ కోర్సులు అన్న భావన బలపడి పోయింది. జేఈఈ, నీట్ పరీక్షలలో మంచి ర్యాంకులు పొందడమే మహా యజ్ఞమైంది. మిగతావన్నీ కొరగానివిగా, అర్భకుల చదువులుగా భావించే అపోహ బలపడ్డాయి. ఇదే అదనుగా కోచింగ్ సెంటర్లు పుట్టుకు వచ్చాయి. కోటల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు విద్యను ఒక వ్యాపార సరుకుగా మార్చేశాయి. ప్రైవేట్ రంగం విజృంభించడానికి ఇలాంటి నీట్ పరీక్షల విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. దీనికితోడు సమాజంలో నిరుద్యోగం, ఉపాధి లేమి అంతకంత పెరుగుతుండడంతో పిల్లల భవిష్యత్తు యెడల అంతులేని అభద్రతాభావం తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఈ పరిస్థితులే కార్పొరేట్ విద్యకు, కోట్ల వ్యాపారానికి, కోచింగ్ సెంటర్ల మాఫియా ముఠాలకు కేంద్రాలుగా మారాయి. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు పట్ల సమాజంలో ఎంతో ఆసక్తి, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఒక బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే మన దేశ విద్యా వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. కొత్తగా తీసుకుని వస్తున్న బిల్లు వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పడానికి లేదు. లీకులకు అలవాటు పడ్డవారు ఎలాంటి శిక్షలకైనా తెగిస్తారు. కోర్టుల్లో బెయిల్ పొందడం వంటి వెసలుబాట్లను ఉపయోగించుకుంటారు.

**పిల్లల చదువులు, వారి భవిష్యత్తు పట్ల సమాజంలో ఎంతో ఆసక్తి, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఒక బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే మన దేశ విద్యా వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. కొత్తగా తీసుకుని వస్తున్న బిల్లు వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పడానికి లేదు. లీకులకు అలవాటు పడ్డవారు ఎలాంటి శిక్షలకైనా తెగిస్తారు. కోర్టుల్లో బెయిల్ పొందడం వంటి వెసలుబాట్లను ఉపయోగించుకుంటారు.**

EDITORIAL



## ఘనంగా శబరీ స్మృతి యాత్ర

ప్రజానావ, భద్రాచలం: దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా అపర శబరిగా పూజలందుకునే పోకల దమ్మక్క స్మృతి యాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భద్రగిరిపై శ్రీ సీతారామచంద్ర స్వామివారిని తొలిసారిగా దర్శించి అర్చన, ఆరాధన నిర్వహించి తాటిపండ్లను నివేదించిన ఆదివాసీ గిరిజన మహిళ పోకల దమ్మక్కను ప్రతి ఏడాది ఈ సందర్భంగా అపర శబరిగా స్మరించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల ఆదివాసీ, గిరిజనులను ఆహ్వానించి సంప్రదాయబద్ధంగా శబరీ స్మృతి యాత్రను నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ, అర్చన, ఆరాధన నిర్వహించి బాలభోగం సమర్పించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. శబరీ స్మృతి యాత్రలో భాగంగా పోకల దమ్మక్క విగ్రహాన్ని నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. ఆదివాసీ గిరిజనులు కొమ్ముబూరలు, డోలు, సన్నాయి వాయిద్యాలతో సంప్రదాయ రీతిలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తూ ఉత్సవంగా పాల్గొన్నారు. అనంతరం మారుతి సదన్‌లో స్వామివారిని వేంచేపు చేసి, ఆదివాసీ భక్తులు తీసుకొచ్చిన పూలు, పండ్లు, పుట్టతేనెను సమర్పించి శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కే. దామోదర్‌రావు, ఏఈఓ శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, లింగాల సాయిబాబా, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆదివాసీ సంఘ నాయకులు ముర్ల రమేష్, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూణెం కృష్ణ, గిరిజన నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు

- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఖమ్మం రూరల్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రైతులు, మహిళలు, పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ



ప్రజానావ, ఖమ్మం: ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి సమాన ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళ్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార–పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పాలేరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి ఖమ్మం రూరల్ మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. డాక్యా తండా గ్రామంలో రూ.1.41 కోట్ల వ్యయంతో మంగళగూడెం–డాక్యా తండా బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, అనంతరం పల్లెగూడెం గ్రామంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుంచి ఎన్ఎస్‌పీ మీదుగా పల్లెగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు కేంద్ర బిందువని, పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదాల వల్లే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ స్థాయి వరకు చేరుతున్నాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9,200 కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని తెలిపారు. వరి రైతులకు కనీస మద్దతు ధరతో పాటు సన్న వరిధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని చెప్పారు. రూ.2 లక్షల వరకు రుణాలు ఉన్న 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసి రైతులపై ఉన్న ఆర్థిక భారం తగ్గించామని వెల్లడించారు. వ్యవసాయానికి అవసరమైన పరికరాలు, మద్దతు కార్యక్రమాలను కూడా ప్రభుత్వం విస్తృతంగా అమలు చేస్తోందన్నారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని, అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, మొదటి విడతలో సుమారు నాలుగున్నర లక్షల ఇళ్లు, రెండో విడతలో రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేసి ఇప్పటివరకు మొత్తం ఏడు లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రెండో విడతలో మిగిలిన గ్రామాలకు కూడా ఇళ్లు మంజూరు చేయనున్నామని, మూడో, నాలుగో విడతల్లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు ఎక్కడా ఆగిపోకుండా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని, గ్రామీణ రహదారులు, విద్యాసంస్థలు, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఈఈ మహేష్‌బాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ముందస్తుగా గుర్తిద్దాం.. క్యాన్సర్‌ను జయిద్దాం

- ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించిన హరీశ్‌రావు
- 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళ తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి
- 'స్వచ్ఛ సిద్ధిపేటతో పాటు హెల్తీ సిద్ధిపేట' లక్ష్యంగా ముందుకు సాగుదాం





ప్రజానావ, సిద్ధిపేట: క్యాన్సర్ అనేది భయపడాల్సిన వ్యాధి కాదని, ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా జయించవచ్చని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత లక్షల రూపాయలు ఖర్చు చేసి చికిత్స చేయించుకోవడం కంటే ప్రారంభ దశలోనే గుర్తించి నివారించుకోవడం ఎంతో ఉత్తమమని పేర్కొన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ ప్రతి కుటుంబం, సమాజం బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. బుధవారం సిద్ధిపేటలోని విపంచి ఆడిటోరియంలో హైదరాబాద్ సింధూ హాస్పిటల్ సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యమే మనిషికి అత్యంత విలువైన సంపద అని, నిర్లక్ష్యం వల్ల చిన్న ఆరోగ్య సమస్యలు కూడా ప్రాణాంతకంగా మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని, ప్రాణాలను కాపాడుకునే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని చెప్పారు. ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి వ్యాధుల నిర్ధారణ కోసం క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, చిన్న సమస్యలను కూడా తేలికగా తీసుకోకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం వంటి కారణాలతో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఒక కుటుంబంలో ఎవరికైనా క్యాన్సర్ వస్తే ఆ కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటూ, వ్యాధి రాకముందే అప్రమత్తం కావడం అత్యవసరమన్నారు. శిబిరంలో నిర్వహిస్తున్న మామోగ్రామ్, పాప్‌స్మియర్ వంటి పరీక్షలు సాధారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చవుతాయని, అయితే ఈ శిబిరంలో వాటిని పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులు తమ ఇళ్లలోని మహిళలను శిబిరానికి తీసుకువచ్చి పరీక్షలు చేయించాలని కోరారు. పొగాకు, గుట్కా, పాన్‌మసాలా వంటి అలవాట్లు నోటి క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని పేర్కొంటూ, ఇలాంటి వ్యసనాలను మాన్పించడంలో కుటుంబ సభ్యుల పాత్ర కీలకమని చెప్పారు. ముఖ్యంగా యువత ఇలాంటి అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ప్రజారోగ్యానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తు చేసిన హరీశ్‌రావు, జిల్లాల వారీగా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలు, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలు, మహిళల కోసం ప్రత్యేకంగా 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని అమలు చేశామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే ఒక కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, కుటుంబం ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొంటూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల మహిళలు కూడా నాణ్యమైన వైద్య సేవలు పొందాలనే ఉద్దేశంతో ఈ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిశుభ్రతలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిన సిద్ధిపేట ఇప్పుడు ప్రజారోగ్య పరిరక్షణలోనూ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. 'స్వచ్ఛ సిద్ధిపేటతో పాటు హెల్తీ సిద్ధిపేట కూడా మన లక్ష్యం కావాలి' అని పేర్కొంటూ ప్రతి ఇంట్లోని మహిళలను శిబిరానికి తీసుకువచ్చి ఉచిత పరీక్షలు చేయించాలని పిలుపునిచ్చారు. ఒక చిన్న పరీక్ష ఒక ప్రాణాన్ని, ఒక కుటుంబాన్ని కాపాడగలదని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన హైదరాబాద్ సింధూ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంచి, ముందస్తు పరీక్షల ద్వారా ప్రాణాలను కాపాడే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ నాయకులు రాజనర్సు, కొండం సంపత్‌రెడ్డి, పాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కోసం పెద్ద సంఖ్యలో మహిళలు శిబిరానికి తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలి

- బీఎల్ఏ–2లతో సమన్వయంగా పనిచేసి ఎన్యూమరేషన్ ఫారాల భర్తీ పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీసీసీ చీఫ్ శివసేనరెడ్డి

ప్రజానావ, వనపర్తి: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో బీఎల్ఏ–2 ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్యూమరేషన్ ఫారాల భర్తీని పకడ్బందీగా నిర్వహించి 100 శాతం పూర్తి చేయాలని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనరెడ్డి సూచించారు. బుధవారం వనపర్తిలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బీఎల్ఏ–2లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శివసేనరెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ ఓట్లను తొలగించే కుట్రలను బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్నాయని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ–2లు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. సమయం తక్కువగా ఉన్నందున ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తూ, అత్యవసర సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఓటర్ల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం ఐక్యతతో పనిచేసినప్పుడే విజయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని బీఎల్ఏ–2లు, వారికి ప్రత్యేకంగా కేటాయించిన ఇన్‌చార్జిలు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలతో సమన్వయంగా పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని, పనిచేసిన వారికి పార్టీ సముచిత గుర్తింపు కల్పిస్తుందని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయిచరణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కోళ్ల వెంకటేష్, శరవంద, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, మండల అధ్యక్షుడు నక్క రవికిరణ్, బీఎల్ఏ–2లు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటరు కార్డుకు ప్రభుత్వ పథకాలతో ఎలాంటి లింక్ లేదు

- అపోహలు నమ్మొద్దు.. ఎన్యూమరేషన్ ఫారాలు తప్పనిసరిగా సమర్పించాలి: కలెక్టర్ హైమావతి
- ఓటరు గుర్తింపు కార్డు కేవలం ఓటు హక్కు వినియోగానికే.. తప్పుడు ప్రచారాలను విశ్వసించవద్దని ప్రజలకు విజ్ఞప్తి



ప్రజానావ, సిద్ధిపేట: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమం నేపథ్యంలో ఓటరు గుర్తింపు కార్డు (ఈపీఐసీ)ని ఏ ప్రభుత్వ సంక్షేమ పథకానికీ అనుసంధానం చేయడం లేదని, ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. హైమావతి స్పష్టం చేశారు. ఓటరు గుర్తింపు కార్డు కేవలం ఓటు హక్కు వినియోగించుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతుందని, దీనికి రేషన్ కార్డు, పెన్షన్, రైతు భరోసా, ఆరోగ్య పథకాలు లేదా ఇతర ప్రభుత్వ సేవలతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కొంతమంది ఎన్యూమరేషన్ ఫారం సమర్పిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిచిపోతాయి, ఓటరు కార్డును ఇతర ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేస్తారు" అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఏమాత్రం నిజం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి వదంతులను ప్రజలు ఏమాత్రం విశ్వసించవద్దని సూచించారు. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లు తమ పరిధిలోని బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) లేదా సమీప హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించి వీలైనంత త్వరగా ఫారం సమర్పించాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించడం వల్ల ఓటరు వివరాలు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం, అవసరమైన సవరణలు చేయడం, ఎన్నికల సంఘం రికార్డులను నవీకరించడం మాత్రమే జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్ఓ, ఈఆర్ఓ కార్యాలయం లేదా హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించి సరైన సమాచారం తెలుసుకోవాలని, సామాజిక మాధ్యమాలు లేదా ఇతర మార్గాల ద్వారా వ్యాపిస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విజ్ఞప్తి చేశారు.

## ముంపు బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

- శివన్నగూడెంలో ముంపు ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ బి. చంద్రశేఖర్
- ఆర్అండ్ఆర్ పరిహారం అందేలా చర్యలు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు



ప్రజానావ, మర్రిగూడ: శివన్నగూడ (చర్లగూడెం) రిజర్వాయర్ ముంపునకు గురైన ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. బుధవారం మర్రిగూడ మండలంలోని శివన్నగూడెంలో ప్రభుత్వం నిర్మిస్తున్న 55 ఇందిరమ్మ ఇళ్లతో పాటు, బాధితులు ప్రైవేట్ వెంచర్‌లో సొంతంగా నిర్మించుకున్న గృహాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, రూ.5 లక్షల గృహ సహాయం, చింతపల్లి ప్లాట్ల వివాద పరిష్కారం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్, కోర్టు ఉత్తర్వుల మేరకు 10 నుంచి 15 రోజుల్లో భూ వివాద అవార్డు ప్రక్రియను పూర్తి చేసి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్లాట్లు, పరిహారం అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, తహశీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీఓ మున్నయ్య, సర్పంచ్ రాపోలు యాదగిరి, తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తుంపెల్లి వాగును పరిశీలించిన కలెక్టర్ కే. హరిత
- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- అత్యవసర సహాయం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజానావ, ఆసిఫాబాద్: జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. బుధవారం ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి వాగు వద్ద వరద ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆమె పరిస్థితిని సమీక్షించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకల్లో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. వరద నీరు వంతెనలపై నుంచి ప్రవహించే పరిస్థితులు ఏర్పడే అవకాశమున్నందున వాహనదారులు, కాలినడకన వెళ్లే ప్రజలను వంతెనలు దాటకుండా అధికారులు, పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు, పశువుల కాపరులు పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల నేపథ్యంలో అత్యవసర సహాయ చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైన సమాచారం, సహాయం కోసం ప్రజలు 8500844365 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ రియాజ్ అలీ, పోలీసు సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాను అత్యుత్తమ స్థాయిలో నిలపాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- విద్యా శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష



ప్రజానావ, సిరిసిల్ల : విద్యారంగంలో జిల్లాను అత్యుత్తమ స్థాయిలో నిలిపేలా అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పీజీఐ (పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్) తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా విద్యాధికారి మొండయ్య, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..ప్రతి 15 రోజులోకసారి అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో మండలాల వారిగా సమావేశం నిర్వహించి నాణ్యమైన విద్య తో పాటు, పాఠశాల మౌలిక వసతులు విద్యార్థులకు అనుకూలంగా ఉండేటట్లు చూసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూర్తి అంకిత భావంతో పని చేసి జిల్లాను అత్యుత్తమ స్థాయిలో జిల్లాను అత్యుత్తమ స్థాయిలో నిలపాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, కో ఆర్డినేటర్లు సతీష్, పద్మజ తదితరులు ఉన్నారు.

## వర్షాలతో రైతుల్లో కొత్త ఆశలు

**విప్ ఆది శ్రీనివాస్**



ప్రజానావ, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట, మల్లారం గ్రామాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కా వాగును రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సాగు పరిస్థితులను తెలుసుకున్నారు. వర్షాల కారణంగా రైతుల కళ్లలో ఆనందం నెలకొందని ఆయన అన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించామని తెలిపారు. జూలై 30, 31, ఆగస్టు 1 తేదీల్లో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో వరుణయాగాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతులు మిగిలిన భూముల్లోనూ సాగుకు సిద్ధమవుతున్నారని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గురు పౌర్ణమి సందర్భంగా వేములవాడ పట్టణంతో పాటు రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో, వేములవాడ పట్టణంలో బోనాల మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయాన్ని సందర్శించిన ఆయన, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నేడు సిరిసిల్ల జిల్లాలో మంత్రులు పొన్నం, తుమ్మల పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- వేములవాడలో వరుణ యాగం
- కలెక్టరేట్ (జోట) జంక్షన్ ప్రారంభోత్సవం
- వరాబావ పరిస్థితులపై కలెక్టరేట్‌లో సమీక్ష





ప్రజానావ, సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభి స్తారు. ఈ మేరకు సిరిసిల్ల వేములవాడ పట్టణాలలో జరిగే కార్యక్రమాల వివరా లను విడుదల చేశారు. ఉదయం 8:00 గంటలకు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో రాష్ట్రంలో సమృద్ధి వర్షాలు కురవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి వరుణ యాగం నిర్వహిస్తారు. ఉదయం 9:00 గంటలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి స్వామి వారిని దర్శించుకున్న తర్వాత గుడి చెరువు ట్యాంక్ బండ్ పార్క్ ప్రారంభిస్తారు. ఉదయం 9:30 గంటలకు వేములవాడ లో తిప్పాపూర్ బస్ స్టేషన్ పునరుద్ధరణకు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 10:30 గంటలకు సిరిసిల్ల నియోజకవర్గంలోని రగుడు బైపాస్ జంక్షన్ ప్రారంభిస్తారు. అనంతరం రగుడు బస్ స్టేషన్ కు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 11:00 గంటలకు ఎల్ నినో ప్రభావం తో వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి జిల్లా కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4:00 గంటలకు కరీంనగర్‌లో సిటీ బస్ సర్వీసులను ప్రారంభిస్తారు.

# వర్షాల వేళ అప్రమత్తంగా కామారెడ్డి పోలీసులు

- ప్రజల భద్రత కోసం జిల్లా వ్యాప్తంగా 24 గంటల పర్యవేక్షణ
- వాగులు, వంతెనలు, ప్రధాన రహదారుల వద్ద కట్టుదిట్టమైన నిఘా..
- పడిపోయిన చెట్ల తొలగింపుతో వేగవంతమైన చర్యలు..
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచన



ప్రజానావ, కామారెడ్డి: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు కామారెడ్డి జిల్లా పోలీసులు జిల్లా వ్యాప్తంగా అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు వాగులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారుల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నారు. మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల్వంచ వంతెన సమీపంలో పాత, వినియోగంలో లేని రహదారిపై వరద నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో గ్రామపంచాయతీ ట్రాక్టర్లను ఇరువైపులా ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. అక్కడ పోలీసులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ ప్రజలను ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అప్రమత్తం చేస్తున్నారు. ఫరీద్‌పేట్–వాడి గ్రామాల మధ్య లోట్టి వాగు వద్ద నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న అడ్డంకులను జేసీబీ సహాయంతో తొలగించి వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గంగమ్మ వాగు వద్ద ప్రస్తుతం పరిస్థితి సాధారణంగానే ఉన్నప్పటికీ ముందుజాగ్రత్త చర్యగా పోలీసు సిబ్బందిని విధుల్లో ఉంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. లింగంపేట్ సమీపంలోని కరీంనగర్–కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై భారీ మర్రిచెట్టు కూలిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో చెట్టును తొలగించి రహదారిని పూర్తిగా క్లియర్ చేసి రాకపోకలను పునరుద్ధరించారు. వర్షాల సమయంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంతెనలను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని, సెల్ఫీల కోసం ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పడవేయవద్దని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ప్రజలకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్–100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రతే లక్ష్యంగా జిల్లా పోలీసులు 24 గంటలూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

# వర్షాకాలంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండండి

- మీ ప్రాణ భద్రతే మా ప్రాధాన్యం
- విద్యుత్ భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించండి
- టీజీఎన్‌పీడీసీఎల్ సిరిసిల్ల జిల్లా ఎస్ఈ టీ. వేణుమాధవ్



ప్రజానావ, సిరిసిల్ల : వర్షాకాలంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని టీజీఎన్‌పీడీసీఎల్ రాజన్న సిరిసిల్ల జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణుమాధవ్ తెలిపారు. విద్యుత్ మన జీవితానికి వెలుగు నిచ్చే అమూల్యమైన శక్తి అయినప్పటికీ, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. గృహ వినియోగదారులు, రైతులు, పశువుల కాపరులు, విద్యార్థులు అలాగే ప్రజలందరూ విద్యుత్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించి ప్రమాదాలను నివారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వర్షం కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలు లేదా తడి గోడలకు ఆనుకుని ఉన్న విద్యుత్ ఉపకరణాలను తాకవద్దు అని పలు సూచనలు చేశారు. తెగిపోయిన, వేలాడుతున్న లేదా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరగా వెళ్లవద్దు, తాకవద్దు. ఉరుములు, మెరుపులు సంభవిస్తున్న సమయంలో చెట్ల క్రింద నిలబడకండి. బహిరంగ ప్రదేశాల్లో అవసరం లేకుండా సంచరించవద్దు. అలాగే గృహ వినియోగదారులు తడి చేతులతో స్విచ్‌లు, ప్లగ్‌లు, మీటర్ బోర్డులు, మోటార్లు, గీజర్లు, కూలర్లు, వాటర్ హీటర్లు లేదా ఇతర విద్యుత్ పరికరాలను తాకరాదు. సెల్‌ఫోన్ ఛార్జింగ్‌లో ఉండగా ఫోన్‌లో మాట్లాడకండి. ముందుగా ఛార్జర్‌ను తొలగించిన తర్వాత మాత్రమే వినియోగించండి. ఇంటి వైరింగ్‌కు తప్పనిసరిగా నాణ్యమైన ఎర్తింగ్ చేయించండి అని సూపరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణుమాధవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## సిరిసిల్లలో ఘనంగా సినారె జయంతి

ప్రజానావ, సిరిసిల్ల: జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ మహాకవి డా. సి. నారాయణ రెడ్డి (సినారె) జయంతి వేడుకలు బుధవారం సిరిసిల్లలో ఘనంగా నిర్వహించారు. జిల్లా రచయితల సంఘం, జిల్లా సాహితీ సమితి, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలుగు సాహిత్యాన్ని, సినీ గేయాలను విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడిగా వక్తలు కొనియాడారు. కార్యక్రమాల్లో పలువురు రచయితలు, కవులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చౌరస్తా, జోటా జంక్షన్ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి సిద్ధం అయ్యాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ లు రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక రగుడు సమీపంలోని కలెక్టరేట్ చౌరస్తా (జంక్షన్) గురువారం ప్రారంభోత్సవ చేయనున్న నేపథ్యంలో బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి కలెక్టరేట్ చౌరస్తా అభివృద్ధి పనులను పరిశీలించి, ప్రారంభోత్సవ కార్యక్రమ నిర్వహణకై స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, ఎమ్మార్వో చంద్రశేఖర్, మున్సిపల్ డి ఈ వాణి, ఎఈ నరసింహస్వామి, సానిటరీ ఇన్స్పెక్టర్ రణం శ్రీనివాస్, ఉమర్ తదితర అధికారులు ఉన్నారు.

–ప్రజానావ, సిరిసిల్ల



## వర్షపాతం వివరాలు ఖచ్చితత్వంతో నమోదు చేయాలి

- సంబంధిత శాఖలకు సకాలంలో సమాచారం అందించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

ప్రజానావ, నిర్మల్: జిల్లా వ్యాప్తంగా నమోదయ్యే వర్షపాతం వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితత్వంతో ఎప్పటికప్పుడు నమోదు చేసి, సంబంధిత శాఖలకు సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూగర్భ జలాల కొలతల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షపాతం, భూగర్భ జలాల వివరాల నమోదు విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, ప్రతి నమోదును శాస్త్రీయ ప్రమాణా లకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం నిర్మల్ గ్రామీణ మండలం అక్కాపూర్ గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రం ప్రాంగణంలో ఉన్న వర్షపాత మాపక కేంద్రాన్ని తనిఖీ చేశారు. వర్షపాతం కొలత, నమోదు ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకుని, నమోదైన వివరాలను వేగంగా సంబంధిత శాఖలకు చేరవేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపాతం నమోదు విషయంలో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి నమోదు శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం ఎల్లపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన పనుల వివరాలను తెలుసుకుని, మిగిలిన పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలలో సీపీవో గంగారెడ్డి, తహసిల్దార్ ప్రభాకర్, ఆర్అండ్‌బీ ఈఈ సుభాష్, హైడ్రో జియాలజిస్ట్ వంశీకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిండుకుండలా కళ్యాణి ప్రాజెక్టు

- వరద ఉధృతితో రెండు గేట్ల ఎత్తి.దిగువకు నీటి విడుదల
- ప్రాజెక్టులోకి 430 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- గోదావరిలోకి 250 క్యూసెక్కులు విడుదల
- నిజాంసాగర్ ప్రధాన కాలువకు 180 క్యూసెక్కుల మళ్లింపు



ప్రజానావ, ఎల్లారెడ్డి: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో కళ్యాణి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరగడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. అధికారుల వివరాల ప్రకారం ప్రస్తుతం ప్రాజెక్టులోకి 430 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా అధికారులు రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. రెండు గేట్ల ద్వారా 250 క్యూసెక్కుల నీటిని గోదావరి నదిలోకి విడుదల చేయగా, మరో 180 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువకు మళ్లించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం ఫుల్ రిజర్వాయర్ లెవల్ (ఎఫ్ఆర్ఎల్) కంటే 0.9 మీటర్లు తక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది భారీ వరదల కారణంగా కళ్యాణి ప్రాజెక్టు సైడ్‌వాల్స్ దెబ్బతినగా, అనంతరం మరమ్మతులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రాజెక్టులో అధికంగా నీటిని నిల్వ చేయకుండా, వచ్చిన వరద నీటిని వెంటనే దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. వర్షాలు ఇదే స్థాయిలో కొనసాగితే దిగువ ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గోదావరి నది ఒడ్డుకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.



## మంత్రుల పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు

- అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- ఎస్పీ మహేష్ బీ.గితే

ప్రజానావ, వేములవాడ : గురువారం రోజున వేములవాడ, సిరిసిల్లలో మంత్రుల బృందం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం సిరిసిల్లలోని రగుడు బై పాస్ జంక్షన్, బస్ షెల్టర్ ప్రాంతాలను, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో ట్యాంక్ బండ్ పార్క్ ప్రాంతాలను ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎస్పీ వెంట డిఎస్పీ లు నాగేంద్రచారి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు, సి.ఐ లు శ్రీనివాస్, వీరప్రసాద్, ఎస్.ఐలు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మన్మోహన్‌కు సుప్రీంకోర్టు క్లీన్‌చిట్

- బొగ్గు బ్లాక్ కేటాయింపు కేసు ముగింపు
- సమన్ల ఉత్తర్వులు రద్దు
- సీబీఐ క్లోజర్ రిపోర్టును ఆమోదించిన ధర్మాసనం

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌పై బొగ్గు బ్లాక్ కేటాయింపు కేసులో నమోదైన క్రిమినల్ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు బుధవారం ముగించింది. ఆయనపై ప్రత్యేక కోర్టు జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను రద్దు చేస్తూ, సీబీఐ సమర్పించిన క్లోజర్ రిపోర్టును ఆమోదించింది. దీంతో ఈ ప్రముఖ కేసులో మన్మోహన్ సింగ్‌కు అధికారికంగా విముక్తి లభించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. దర్యాప్తు సంస్థ సమర్పించిన క్లోజర్ రిపోర్టులను తిరస్కరించి, కేసును విచారణకు స్వీకరించడానికి ప్రత్యేక న్యాయమూర్తికి తగిన కారణాలు లేవని స్పష్టం చేసింది. అందువల్ల క్లోజర్ రిపోర్టులను ఆమోదిస్తూ కేసును ముగిస్తున్నట్లు పేర్కొంది. ఈ కేసు ఒడిశాలోని తలబిరా–II బొగ్గు బ్లాక్‌ను 2005లో హిందాల్కో ఇండస్ట్రీస్‌కు కేటాయించిన వ్యవహారానికి సంబంధించినది. అప్పట్లో బొగ్గు శాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న మన్మోహన్ సింగ్‌తో పాటు పారిశ్రామికవేత్త కుమార్ మంగళం బిర్లా, మాజీ బొగ్గు శాఖ కార్యదర్శి పి.సి. పరాఖ్, హిందాల్కో సంస్థ, దాని అధికారులు శుభేందు అమితాబ్, డి. భట్టాచార్యలను ప్రత్యేక సీబీఐ కోర్టు నిందితులుగా సమన్లు జారీ చేసింది.

### సీబీఐ క్లోజర్ రిపోర్టు

కేసులో సీబీఐ తొలుత ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ, అనంతరం తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ క్లోజర్ రిపోర్టు దాఖలు చేసింది. అయితే ప్రత్యేక కోర్టు దానిని తిరస్కరించి, మన్మోహన్ సింగ్‌తో పాటు అప్పటి ప్రధానమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులను కూడా విచారించాలని ఆదేశించింది. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మన్మోహన్ సింగ్ విచారణకు అవసరమైన చట్టబద్ధ అనుమతి లేదని, తన నిర్ణయంలో ఎలాంటి నేరపూరిత ఉద్దేశం లేదని వాదించారు. 2024 డిసెంబర్ 27న మన్మోహన్ సింగ్ మరణించిన నేపథ్యంలో అప్పీల్ సాంకేతికంగా నిర్వీర్యమైనప్పటికీ, ఆయనపై సమన్ల చట్టబద్ధతను పరిశీలించిన సుప్రీంకోర్టు సీబీఐ క్లోజర్ రిపోర్టును ఆమోదిస్తూ కేసును పూర్తిగా ముగించింది.

# 'కాలా హిరణ్' టీజర్‌కు హైకోర్టు బ్రేక్

**24 గంటల్లో టీజర్, ప్రచార పోస్టులు తొలగించాలని ఆదేశం**

**న్యూఢిల్లీ:** బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ వ్యక్తిత్వ హక్కులను ఉల్లంఘిస్తున్నారన్న అభ్యంతరాలతో దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సల్మాన్ జీవితాన్ని పోలి ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న 'కాలా హిరణ్: ది బ్యాటిల్ ఫర్ లీగల్' చిత్రానికి సంబంధించిన టీజర్‌తో పాటు ప్రచార పోస్టులను అన్ని ఆన్‌లైన్ వేదికల నుంచి తొలగించాలని ఆదేశించింది. న్యాయమూర్తి జ్యోతి సింగ్ మాట్లాడుతూ.. ఒక వ్యక్తి పేరు, హావభావాలు, ప్రత్యేక గుర్తింపులు వంటి వ్యక్తిత్వ లక్షణాలను ఆయన అనుమతి లేకుం డా వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగిం చడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అలాంటి ప్రచారం వ్యక్తి ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే అది మరింత తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# నీట్ నిరసనలపై సిట్ విచారణకు మొగ్గు

- పోలీస్ దౌర్జన్యాల ఆరోపణలపై స్వతంత్ర, పారదర్శక దర్యాప్తు అవసరం
- 250 మంది పోలీసులపై దాడుల ఉన్నదెవరో తేల్చాలి : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా చోటుచేసుకున్న పోలీసు దౌర్జన్యాల ఆరోపణలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. విద్యార్థులపై పోలీసుల చర్యలతో పాటు ఆందోళనల్లో చోటుచేసుకున్న అన్ని హింసాత్మక ఘటనలపై నిష్పక్షపాత, స్వతంత్ర, పారదర్శక దర్యాప్తు నిర్వహించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. నిర్దేశిత నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, విద్యార్థులపై పోలీసు దౌర్జన్యాల ఆరోపణలపై స్వతంత్ర విచారణ ఎందుకు జరపకూడదని ప్రశ్నించింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అతిక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. అన్ని ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలని ధర్మాసనం అభిప్రాయపడింది.

### అసలు నిందితులెవరు?

ఆందోళనల సందర్భంగా సుమారు 250 మంది పోలీసు సిబ్బందిపై దాడులు జరిగినట్లు నమోదైన ఘటనలను కూడా కోర్టు ప్రస్తావించింది. ఈ దాడులకు నిజంగా విద్యార్థులే కారణమా? లేక ఆందోళనల్లోకి చొరబడ్డ ఇతర దుండగులా? అనే అంశాన్ని కూడా సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. కేంద్రం తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, శాంతియుతంగా నిరసన తెలిపే విద్యార్థులు పోలీసులపై హింసకు పాల్పడరని తెలిపారు. హత్య, అత్యాచారం, మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులైన కొందరు దుండగులు ఆందోళనల్లో చొరబడి పోలీసులపై దాడులకు పాల్పడ్డారని కోర్టుకు వివరించారు. ఇప్పటికే సోమవారం జరిగిన విచారణలో సుప్రీంకోర్టు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. అదే సమయంలో, ఆందోళన పేరుతో పోలీసు దౌర్జన్యాలు లేదా విచక్షణారహిత లాఠీచార్జీని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేమని పేర్కొంది. జూలై 20న ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడికి ప్రయత్నించిన కాక్‌రోచ్ జనతా పార్టీ నేతృత్వంలోని విద్యార్థులపై భద్రతా బలగాలు లాఠీచార్జీ, టియర్‌గ్యాస్ ప్రయోగించాయి. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన చేపట్టారు. ఈ ఘటనలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ కొనసాగుతోంది.

## నీట్ పేపర్ లీక్ కేసులో కీలక ముందడుగు

- సీబీఐ ఛార్జ్‌షీట్‌ను రికార్డులోకి తీసుకున్న ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు
- 13 మందిపై విచారణకు మార్గం సుగమం
- ఆగస్టు 3న తదుపరి విచారణ

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ–2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను ప్రజా పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజీ కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు బుధవారం రికార్డులోకి తీసుకుంది. ప్రత్యేక న్యాయమూర్తి అను గ్రోవర్ బలీ 13 మంది నిందితులపై సీబీఐ సమర్పించిన తుది నివేదికను స్వీకరిస్తూ, కేసుకు సంబంధించిన అనుబంధ పత్రాలను సమర్పించేందుకు దర్యాప్తు సంస్థకు గడువు మంజూరు చేశారు. ఈ కేసుకు సంబంధించిన సుమారు 20వేల పేజీల అనుబంధ పత్రాలు ప్రస్తుతం స్కానింగ్ ప్రక్రియలో ఉన్నాయని సీబీఐ కోర్టుకు తెలిపింది. మరో మూడు రోజుల్లో వాటిని సమర్పిస్తామని వెల్లడించింది. ఈ నేపథ్యంలో తదుపరి విచారణను ఆగస్టు 3కు వాయిదా వేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ముగ్గురు ప్రశ్నపత్ర నిపుణులు, రెండు కోచింగ్ సెంటర్లకు చెందిన వ్యక్తులు, మధ్యవర్తులు, ప్రశ్నపత్ర లీక్ ద్వారా లబ్ధి పొందిన కొందరు అభ్యర్థులు సహా మొత్తం 13 మందిపై సీబీఐ మంగళవారం ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. దీంతో నిందితులపై విచారణ ప్రక్రియకు మార్గం సుగమమైంది.

### పలు చట్టాల కింద అభియోగాలు

నిందితులపై నేరపూరిత కుట్ర, మోసం, విశ్వాసద్రోహం, సాక్ష్యాల ధ్వంసం తదితర అభియోగాలతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), అవినీతి నిరోధక చట్టం, ప్రజా పరీక్షలు (అక్రమ మార్గాల నిరోధక) చట్టం–2024 కింద సీబీఐ కేసులు నమోదు చేసింది. ఈ కేసులో సీబీఐ తరఫున వాదనలు వినిపించేందుకు అడ్వొకేట్లు వి.కె. పాఠక్, అర్జున్ ఆనంద్‌లను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమించినట్లు సమాచారం.

# మోదీ పోస్టు వివాదం.. మెటా దిద్దుబాటు చర్యలు

- వీఐపీ ఖాతాలకు అదనపు భద్రతా వ్యవస్థ
- పోస్టులపై సీనియర్ అధికారుల పర్యవేక్షణ

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించబడిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడంతో మెటా సంస్థ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రధానమంత్రి సహా ప్రముఖ వ్యక్తుల సోషల్ మీడియా ఖాతాలకు సంబంధించిన పోస్టులపై మరింత కఠినమైన భద్రతా విధానాలు అమలు చేయనున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (మెయిటీ)కి మెటా వివరించినట్లు సమాచారం. ప్రముఖ ఖాతాల పోస్టులపై అదనపు పర్యవేక్షణ ఉంటుందని, ఏదైనా చర్య తీసుకునే ముందు సంస్థలోని సీనియర్ అధికారుల పలు స్థాయిల్లో పరిశీలన తప్పనిసరిగా ఉంటుందని మెటా తెలిపినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రధాని పోస్టు తొలగింపు వ్యవహారంపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు మెటా ప్రతినిధులు త్వరలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం కానున్నట్లు సమాచారం. ఈ వారం చివర్లో లేదా వచ్చే వారం ప్రారంభంలో జరిగే ఈ భేటీలో ఘటనకు దారితీసిన కారణాలు, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా తీసుకునే చర్యలపై చర్చించే అవకాశం ఉంది.

### 'టెక్నికల్ గ్లిచ్' వివరణపై అసంతృప్తి

విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ జూలై 23న ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన సెల్ఫీ వీడియోను ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు. అయితే ఆ పోస్టు కొద్దిసేపు కనిపించకుండా పోవడంతో వివాదం చెలరేగింది. అనంతరం సాంకేతిక లోపం కారణంగానే పోస్టు తొలగించబడిందని మెటా వివరణ ఇచ్చి క్షమాపణలు చెప్పింది. అయితే ఈ వివరణపై కేంద్ర ఐటీ శాఖ సంతృప్తి వ్యక్తం చేయలేదు. ఘటనపై మెటా గ్లోబల్ పబ్లిక్ పాలసీ విభాగం ఉన్నతాధికారిని ప్రభుత్వం పిలిపించి వివరణ కోరింది. ఏఐ ఆధారిత ఆటోమేటెడ్ కంటెంట్ ఫిల్టర్లలో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగానే ప్రధాని పోస్టు పొరపాటున తొలగించబడిందని మెటా ప్రభుత్వానికి తెలిపినట్లు సమాచారం. అనంతరం పోస్టును పునరుద్ధరించినట్లు సంస్థ వెల్లడించింది. అయితే సాంకేతిక లోపం కారణమైతే, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ఆటోమేటెడ్ వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయాలని కేంద్ర ప్రభుత్వం మెటాకు సూచించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# సుంకాల బెదిరింపులకు తలొగ్గొద్దు

**న్యూఢిల్లీ:** రష్యా నుంచి ముడి చమురు దిగుమతులపై నిర్ణయాలు అమెరికా సుంకాల ఒత్తిడికి అనుగుణంగా కాకుండా, భారత ఆర్థిక ప్రయోజనాలు, ఇంధన భద్రత, వ్యూహాత్మక స్వతంత్రత ఆధారంగా ఉండాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) పేర్కొంది. రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం ఉన్న అమెరికా ప్రతిపాదనల నేపథ్యంలో జీటీఆర్ఐ ఈ సూచనలు చేసింది. వాషింగ్టన్‌తో విభేదాలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపింది. రష్యా నుంచి లభిస్తున్న తక్కువ ధరల ముడి చమురు భారత్ దిగుమతి వ్యయాన్ని తగ్గించడంతో పాటు ఇంధన భద్రతకు, ద్రవ్యోల్బణ నియంత్రణకు దోహదం చేస్తోందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు.

# పాకిస్థాన్ కశ్మీర్ కాదు.. పాక్ ఆక్రమిత కశ్మీర్

- న్యూయార్క్ టైమ్స్ కథనంపై భారత రాయబార కార్యాలయం అభ్యంతరం
- జమ్మూ కశ్మీర్, లడఖ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం

**వాషింగ్టన్:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను 'పాకిస్థాన్ కశ్మీర్'గా పేర్కొంటూ అమెరికా పత్రికలో వచ్చిన కథనంపై భారత రాయబార కార్యాలయం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది తప్పుదోవ పట్టించే, వాస్తవాలకు విరుద్ధమైన శీర్షికగా పేర్కొంటూ స్పష్టత ఇచ్చింది. అమెరికాలోని భారత రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "పాకిస్థాన్ కశ్మీర్ అంటూ ఎలాంటి ప్రాంతం లేదు. అది కేవలం పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ మాత్రమే" అని పేర్కొంది. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగాలుగా ఉంటాయని స్పష్టం చేసింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో జరిగిన హింసాత్మక ఘటనలపై ప్రముఖ అమెరికా పత్రిక 'న్యూయార్క్ టైమ్స్' ప్రచురించిన కథనంలో ఈ పద ప్రయోగం చేసినట్లు భారత రాయబార కార్యాలయం పేర్కొంది. పాకిస్థాన్ అక్రమంగా భారత భూభాగాలను ఆక్రమించిందని, ప్రస్తుతం అక్కడి ప్రజలపై హింసను ప్రయోగిస్తోందని ఆరోపించింది. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం.. జూన్ ప్రారంభం నుంచి జరిగిన ఘర్షణల్లో నిరసనకారులు, భద్రతా సిబ్బంది, సాధారణ పౌరులు కలిపి కనీసం 30 మంది మృతి చెందినట్లు స్థానిక అధికారులు, స్వతంత్ర వర్గాల అంచనాలను ఉటంకించింది.

### పీవోకేలో కొనసాగుతున్న నిరసనలు

పీవోకేలోని జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గత నెల నుంచి నిరసనలు కొనసాగుతున్నాయి.

# భారత్‌కు లాభం చేకూరితేనే అమెరికా డీల్

- పోటీ దేశాల సుంకాలతో సమాన అవకాశాలు కల్పించాల్సిందే
- వాణిజ్య ఒప్పందం అమలుపై పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** భారత్–అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) తొలి దశ అమలు కావాలంటే భారత ఉత్పత్తులకు పోటీ దేశాల కంటే మెరుగైన ప్రయోజనం లభించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. సుంకాల విషయంలో సమాన అవకాశాలు ఉంటే అమెరికా మార్కెట్‌లో భారత ఎగుమతులు మరింత పెరుగుతాయని అన్నారు. అమెరికా మార్కెట్‌లో భారత్‌కు శ్రీలంక, బంగ్లాదేశ్, వియత్నాం, థాయ్‌లాండ్, కంబోడియా, ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలతో పోటీ ఉందని గోయల్ పేర్కొన్నారు. 2025–26లో అమెరికాకు భారత్ నుంచి దాదాపు 87 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు ఎగుమతి చేసినట్లు తెలిపారు. బీటీఏ తొలి దశ అమలుకు సంబంధించి అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

### ఎగుమతుల్లో 15 శాతం వృద్ధి

ప్రపంచ అనిశ్చిత పరిస్థితులు, ముడి చమురు సరఫరా సమస్యలు, అంతర్జాతీయ పరిణామాల మధ్యనూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ ఎగుమతులు 15 శాతం పెరిగాయని గోయల్ తెలిపారు. అమెరికా సుంక విధానాల ప్రభావం ఉన్నప్పటికీ ఎగుమతుల వృద్ధి కొనసాగుతోందన్నా రు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశీయ వ్యాపారాలకు 70 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ అవకాశాలను తెరిచాయని చెప్పారు. భారత్–యూరోపియన్ యూనియన్ ఎఫ్‌టీఏ చట్టపరమైన పరిశీలన దశలో ఉందని, వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

### స్టార్టప్‌లకు ప్రారంభ పెట్టుబడులు కీలకం

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని గోయల్ సూచించారు. స్టార్టప్‌లను ఆలోచనల దశ నుంచి వాణిజ్య స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రారంభ దశలోనే దేశీయ పెట్టుబడులు అందించాలని కోరారు. భారత ఆవిష్కరణలు విదేశీ సంస్థల చేతుల్లోకి వెళ్లకుండా పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# ఒడిశాను ముంచెత్తిన వరదలు

- ముగ్గురు మృతి.. 2లక్షల మందికిపైగా ప్రభావితం
- ప్రమాద స్థాయిని దాటిన ప్రధాన నదులు
- జల దిగ్బంధనంలో ఆరు జిల్లాలు



**భువనేశ్వర్:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఒడిశాలో వరదల పరిస్థితి మరింత విషమించింది. ప్రధాన నదులన్నీ ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తుండటంతో ఉత్తర ఒడిశాలోని ఆరు జిల్లాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ విపత్తులో అగ్నిమాపక సిబ్బందికి చెందిన ఒకరు సహా ముగ్గురు మృతి చెందగా, రెండు లక్షల మందికిపైగా వరదల ప్రభావానికి గురైనట్లు అధికారులు తెలిపారు. బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, మయూర్‌భంజ్, సంబల్‌పూర్, ఢెంకనాల్ జిల్లాల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉంది. మొత్తం 44 బ్లాక్‌ల పరిధిలోని 266 గ్రామాలు నీట మునిగిపోయాయి. వరదలతో 761 ఇళ్లు దెబ్బతినగా, 7,901 హెక్టార్ల వ్యవసాయ భూమి నీట మునిగింది. మరోవైపు కియోంజర్, సుందర్‌గఢ్, ఝార్సుగూడా, బర్‌గఢ్, నువాపడ, కలహండి, రాయగడ, గజపతి జిల్లాల్లోనూ వరద ప్రభావం కనిపిస్తోంది. లోతట్టు ప్రాంతాల నుంచి సుమారు 30 వేల మందిని సహాయ శిబిరాలకు తరలించారు. అక్కడ బాధితులకు వండిన ఆహారం అందిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఒడ్రాఫ్, అగ్నిమాపక దళాల బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటుండగా, వరద నిర్వహణ పర్యవేక్షణ కోసం ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం నియమించింది.

### మహానదిలో పెరుగుతున్న నీటి మట్టం

ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశాలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మహానదిలో నీటి ప్రవాహం పెరుగుతోంది. హీరాకుడ్ జలాశయంలో నీటి మట్టం 616 అడుగులకు చేరగా, 620 అడుగులు దాటితే అదనపు గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కటక్ సమీపంలోని నరాజ్ వద్ద గురువారం నాటికి ప్రవాహం 9 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశముందని అంచనా వేశారు. వరదల దృష్ట్యా 10 జిల్లాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించారు. రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో మరిన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

### ముఖ్యమంత్రి అప్రమత్తం

ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, బాధితుల ప్రాణ భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన అగ్నిమాపక సిబ్బంది చందన్ పట్టనాయక్‌కు ఆయన సంతాపం తెలిపారు.

# 2030 నాటికి 100 కోట్ల మందికి 5జీ

- రెండున్నరేళ్లలోనే 50 కోట్ల మందికి సేవలు
- టెలికాం రంగంలో భారత్ వేగవంతమైన ప్రగతి
- 6జీకి భారత్ సిద్ధమవుతోందన్న సింధియా

**న్యూఢిల్లీ:** 2030 నాటికి దేశంలో 100 కోట్ల మందికి 5జీ సేవలు అందించే లక్ష్యంతో భారత్ ముందుకు సాగుతోందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. కేవలం రెండున్నరేళ్లలోనే దాదాపు 50 కోట్ల మందికి 5జీ సేవలు చేరడం దేశ టెలికాం విప్లవానికి నిదర్శనమన్నారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో దేశ తొలి టెలికాం మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (TMZ) ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్–2026 థీమ్ ఆవిష్కరణ కార్యక్రమంలో సింధియా మాట్లాడుతూ, డేటా సెంటర్లు, చిప్ తయారీ సంస్థలు, టెలికాం పరిశ్రమలకు అవసరమైన పూర్తి 'ప్లగ్ అండ్ ప్లే' మౌలిక వసతులతో గ్వాలియర్‌లో ప్రత్యేక టెలికాం తయారీ జోన్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

### 5జీ నుంచి 6జీ దిశగా

దేశంలో మొబైల్ వినియోగదారులు 133 కోట్లకు చేరగా, డేటా ధరలు జీబీకి రూ.287 నుంచి సుమారు రూ.8కు తగ్గాయని సింధియా పేర్కొన్నారు. రూ.4.5 లక్షల కోట్ల పెట్టుబడులతో దాదాపు ఐదు లక్షల టవర్లు నిర్మించి, 50 కోట్ల మందికి 5జీ సేవలు అందించినట్లు వెల్లడించారు. 6జీ సాంకేతికతలోనూ భారత్ ప్రపంచ ప్రమాణాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, స్వదేశీ 4జీ విజయానంతరం దేశవ్యాప్తంగా హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ విస్తరణపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. భారత్‌నెట్, 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి గ్రామానికి వేగవంతమైన ఇంటర్నెట్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్–2026కు 'స్కేల్ విదౌట్ బౌండరీస్' అనే థీమ్‌ను ప్రకటించారు. అక్టోబర్ 7 నుంచి 10 వరకు న్యూఢిల్లీలోని యశో భూమి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ మహాసదస్సులో 100కుపైగా దేశాల నుంచి ప్రతినిధులు, 300కు పైగా సంస్థలు పాల్గొననున్నాయి. 5జీ, 6జీ, కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూ టింగ్, సైబర్ సెక్యూరిటీ తదితర ఆధునిక సాంకేతిక ఆవిష్కరణలు ఇందులో ప్రదర్శించనున్నారు.

# యునెస్కో వారసత్వ జాబితాలో సారనాథ్

- ప్రపంచ జాబితాలో కొత్తగా 25 ప్రదేశాలు
- మరో ఆరింటికి ప్రమాద గుర్తింపు
- 173 దేశాల్లో 1,273కు చేరిన ప్రపంచ వారసత్వ సంపద

**న్యూఢిల్లీ:** ప్రపంచ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో భాగంగా యునెస్కో కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రపంచ వారసత్వ జాబితాలో కొత్తగా 25 ప్రదేశాలను చేర్చగా, మరో ఆరు ప్రదేశాలను 'ప్రమాదంలో ఉన్న ప్రపంచ వారసత్వ ప్రదేశాల' జాబితాలో చేర్చింది. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో జరిగిన యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ 48వ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రాచీన బౌద్ధ క్షేత్రం సారనాథ్‌కు యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించింది. బుద్ధుడు తొలి ధర్మ బోధన చేసిన పవిత్ర స్థలంగా పేరొందిన సారనాథ్ అంతర్జాతీయ వారసత్వ జాబితాలో చోటు దక్కించుకుంది. కొత్తగా చేర్చిన ప్రదేశాల్లో ఇరాన్‌లోని అలముట్ కోట, జోర్డాన్‌లోని అఖాబా మెరైన్ రిజర్వ్, అమెరికాలోని ఒకెఫెనోకీ నేషనల్ వైల్డ్‌లైఫ్ రిఫ్యూజ్, జపాన్‌లోని అసుకా, ఫుజివారా ప్రాచీన నగరాలు, ఉజ్బెకిస్థాన్‌లోని తాష్కెంట్ ఆధునిక వాస్తుశిల్పం, గ్రీస్‌లోని మౌంట్ ఒలింపస్ ప్రాంతాలు ఉన్నాయి.

### తొలిసారి మూడు ఆఫ్రికా దేశాలకు గుర్తింపు

కొమొరోస్, సావో టోమే అండ్ ప్రిన్సిపే, దక్షిణ సూడాన్ దేశాలకు చెందిన ప్రదేశాలు తొలిసారి యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేరాయి. తాజా చేర్పులతో 173 దేశాల్లోని ప్రపంచ వారసత్వ ప్రదేశాల సంఖ్య 1,273కు చేరింది. వీటిలో 19 సాంస్కృతిక, 5 సహజ, ఒక మిశ్రమ వారసత్వ ప్రదేశాలు ఉన్నాయి. ఆస్ట్రియాలోని హిస్టారిక్ సెంటర్ ఆఫ్ వియన్నాను 'ప్రమాదంలో ఉన్న వారసత్వ ప్రదేశాల' జాబితా నుంచి తొలగించాలని కమిటీ నిర్ణయించింది. ఫ్రాన్స్‌లోని డీ–డే ల్యాండింగ్స్ బీచ్‌లు, నార్మండీ 1944 ప్రాంతాన్ని స్మృతి ప్రదేశంగా వారసత్వ జాబితాలో చేర్చింది.

# విద్యార్థులపై పోలీస్ అణచివేత ఆపాలి

**జంతర్‌మంతర్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల నిరసన**




**న్యూఢిల్లీ:** విద్యార్థి ఉద్యమాలపై పోలీసుల అణచివేతను నిలిపివేయాలని, ఆందోళనల్లో అరెస్టయిన విద్యార్థి కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పలు వామపక్ష అనుబంధ విద్యార్థి సంఘాలు బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో నిరసన చేపట్టాయి. విద్యార్థి ఉద్యమాలను నేరాలుగా పరిగణిస్తూ అణచివేత చర్యలకు పాల్పడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించాయి. స్టూడెంట్–యూత్ యూనిటీ; లాంగ్ లివ్ నినాదంతో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం (జేఎన్‌యూఎస్‌యూ) పిలుపుతో ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, కేవైఎస్, ఏఐడీఎస్ఓ, డీఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీఎస్ఏ, పీఎస్‌వైఏ, ఏసీఎన్ఎస్, కలెక్టివ్, దిశా, పచ్చాస్ తదితర విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థుల అరెస్టులు ఆపాలి, విద్యార్థి ఉద్యమాలను నేరాలుగా ముద్ర వేయొద్దు అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. బీహార్, పశ్చిమ బెంగాల్‌తో పాటు పలు రాష్ట్రాల్లో విద్యార్థి, యువజన ఉద్యమాల పట్ల పోలీసులు అనుసరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు.

### ఉద్యమం కొనసాగించాలని పిలుపు

సభలో మాట్లాడిన దిశా సంస్థ ప్రతినిధి, గత విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మరోసారి జంతర్‌మంతర్‌లో ఆందోళనకు పిలుపునివ్వాలని కోరారు. ఉద్యమం ఉత్సాహం కోల్పోతే విద్యార్థుల్లో నిరాశ పెరుగుతుందని, సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని కొనసాగించడం అవసరమని ఆమె అన్నారు.

### పోలీసుల తీరుపై విమర్శలు

జూలై 20న జరిగిన నిరసన ర్యాలీలో విద్యార్థులపై బలప్రయోగానికి పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు ప్లకార్డులు ప్రదర్శించారు. అలాగే ఉద్యమానికి సంబంధించిన పలు సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేశారని, నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వేధింపులు కొనసాగుతున్నాయని విద్యార్థి నాయకులు ఆరోపించారు.






# బాక్సింగ్‌లో భారత్ పంచ్

- కామన్వెల్త్‌లో కొనసాగుతున్న భారత్ జైత్రయాత్ర
- మరో ఆరుగురు సెమీస్‌లోకి.. మొత్తం 10 పతకాలు ఖాయం
- బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ రికార్డును ఇప్పటికే అధిగమించిన బాక్సర్లు

**గ్లాస్గో:** కామన్వెల్త్ క్రీడల బాక్సింగ్‌లో భారత బాక్సర్లు మరోసారి తమ సత్తా చాటారు. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో మరో ఆరుగురు భారత బాక్సర్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లడంతో భారత్‌కు మొత్తం 10 పతకాలు ఖాయమయ్యాయి. దీంతో 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో సాధించిన ఏడు పతకాల రికార్డును భారత జట్టు ఇప్పటికే అధిగమించింది. ఇప్పటికే సెమీఫైనల్‌కు చేరిన లవ్లీనా బోర్గొహైన్ (75 కేజీలు), ప్రియా ఘంఘాస్ (60 కేజీలు), ప్రీతి పవార్ (54 కేజీలు), జాదుమణి సింగ్ (55 కేజీలు)లకు తోడు తాజా పోటీల్లో సాక్షి చౌదరి (51 కేజీలు), అరుంధతి చౌదరి (70 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు), అంకుష్ పంఘాల్ (80 కేజీలు), నరేందర్ బెర్వాల్ (+90 కేజీలు), ప్రపంచ చాంపియన్ జైస్మిన్ లంబోరియా (57 కేజీలు) కూడా చివరి నలుగురిలో స్థానం దక్కించుకున్నారు. సెమీఫైనల్‌కు చేరిన ప్రతి బాక్సర్‌కు కనీసం కాంస్య పతకం ఖాయమవుతుంది.

### సాక్షి, సచిన్ ఏకపక్ష విజయం

మహిళల 51 కేజీల విభాగంలో సాక్షి చౌదరి ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన కైట్‌లిన్ ఫ్రయర్స్‌పై 5–0తో అద్భుత విజయం నమోదు చేసింది. తన ఎత్తు, రీచ్‌ను సమర్థంగా వినియోగించుకున్న ఆమె తొలి రౌండ్ నుంచే ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. పురుషుల 60 కేజీల విభాగంలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఐదో స్థానంలో ఉన్న సచిన్ సివాచ్ బోట్స్వానాకు చెందిన ట్రెజర్ మొరెమిని 5–0తో చిత్తు చేసి సెమీస్‌లో అడుగుపెట్టాడు. మహిళల 70 కేజీల విభాగంలో అరుంధతి చౌదరి న్యూజిలాండ్‌కు చెందిన మోర్గాన్ హెండర్సన్‌పై 3–1తో విజయం సాధించింది. ప్రత్యర్థి నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనా, కీలక సందర్భాల్లో సమర్థవంతమైన పంచ్‌లతో ఆధిక్యం సాధించి సెమీఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. మహిళల 57 కేజీల క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ చాంపియన్ జైస్మిన్ లంబోరియా ఇంగ్లండ్‌కు చెందిన ఎలీస్ గ్లిన్‌పై 4–1తో గెలిచి సెమీఫైనల్‌కు చేరింది. దీంతో ఆమెకు కనీసం కాంస్య పతకం ఖాయమైంది. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో సాధించిన కాంస్య పతకాన్ని కనీసం సమం చేసే అవకాశాన్ని ఆమె దక్కించుకుంది.

### అంకుష్ జోరు.. బెర్వాల్‌కు ఉత్కంఠ విజయం

పురుషుల 80 కేజీల విభాగంలో అంకుష్ పంఘాల్ సెషెల్స్‌కు చెందిన జేడ్ మైకాక్‌పై 5–0తో ఏకగ్రీవ తీర్పు సాధించి సునాయాసంగా సెమీస్‌కు చేరాడు. హెవీవెయిట్ (+90 కేజీలు) విభాగంలో నరేందర్ బెర్వాల్ సమోవాకు చెందిన మైకేల్ సెకోతో హోరాహోరీగా పోరాడి 3–2తో ఉత్కంఠభరిత విజయాన్ని నమోదు చేశాడు.



గురుపౌర్ణమి సందర్భంగా భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన చిన్ననాటి గురువు, దివంగత రమాకాంత్ అచ్రేకర్‌కు హృదయ పూర్వకంగా నివాళులర్పించారు. 'ఎన్నేళ్లు గడిచినా మీకు చెప్పాల్సిన మరో థ్యాంక్యూ ఎప్పుడూ మిగిలే ఉంటుంది. నన్ను నమ్మి, సరైన మార్గంలో నడిపించి, ఈ స్థాయికి చేరుకునేలా చేసినందుకు ధన్యవాదాలు సర్. గురుపౌర్ణమి శుభాకాంక్షలు అచ్రేకర్ సర్' అని సచిన్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

## గిల్.. మళ్లీ నంబర్ వన్

- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం
- టీ20లో 230 స్థానాలు ఎగబాకిన వైభవ్

**దుబాయ్:** భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో మరోసారి ప్రపంచ నంబర్–1 స్థానాన్ని దక్కించుకున్నాడు. ఇటీవల వెస్టిండీస్–న్యూజిలాండ్ వన్డే సిరీస్ అనంతరం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్‌కు చెందిన డారిల్ మిచెల్‌ను అధిగమించి గిల్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ ఏడాది జనవరి నుంచి మిచెల్ నంబర్–1గా కొనసాగుతున్నాడు. జింబాబ్వే పర్యటనలో అద్భుత ప్రదర్శన చేసిన 15ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ టీ20 అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 230 స్థానాలు ఎగబాకి 48వ స్థానానికి చేరుకున్నాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు అర్ధశతకాలతో మొత్తం 151 పరుగులు చేసి భారత్ 3–0తో సిరీస్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు.



### అగ్రస్థానంలోనే ఇషాన్

టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత వికెట్‌కీపర్ ఇషాన్ కిషన్ 910 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని కొనసాగిస్తున్నాడు. రెండో స్థానంలో ఉన్న సాహిబ్‌జాదా ఫర్హాన్‌పై అతనికి స్పష్టమైన ఆధిక్యం ఉంది. తిలక్ వర్మ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఆరో స్థానానికి చేరగా, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఏడు స్థానాలు ఎగబాకి 24వ స్థానంలో నిలిచాడు. ఇక టీ20 బౌలర్ల జాబితాలో రవి బిష్ణోయ్ 31 స్థానాలు మెరుగుపరుచుకుని 41వ స్థానానికి చేరుకున్నాడు. గాయం కారణంగా జింబాబ్వే పర్యటనకు దూరమైన వరుణ్ చక్రవర్తి మూడు స్థానాలు దిగజారినా టాప్–10లోనే కొనసాగుతున్నాడు.

## 300 మిలియన్ డాలర్ల క్లబ్‌లోకి ఆర్సీబీ

- ప్రపంచ క్రికెట్‌లో తొలి ఫ్రాంచైజీగా చరిత్ర
- బ్రాండ్ విలువ, ఆదాయంలో ఐపీఎల్ మరోసారి రికార్డు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రపంచ క్రీడా వ్యాపార రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హౌలిహాన్ లోకే విడుదల చేసిన 2026 బ్రాండ్ వాల్యుయేషన్ నివేదిక ప్రకారం, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) 312 మిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో 300 మిలియన్ డాలర్ల మార్క్‌ను దాటిన ప్రపంచంలోనే తొలి క్రికెట్ ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది. 2026లో ఐపీఎల్ వ్యాపార విలువ గత ఏడాదితో పోలిస్తే 11.4 శాతం పెరిగి 20.6 బిలియన్ డాలర్లకు చేరింది. లీగ్ స్వతంత్ర బ్రాండ్ విలువ కూడా 10.3 శాతం వృద్ధితో 4.3 బిలియన్ డాలర్లకు పెరిగింది. 2023 నుంచి ఇప్పటివరకు ఐపీఎల్ బ్రాండ్ విలువ 1.1 బిలియన్ డాలర్లకు పైగా పెరగడం విశేషం.

### ఆర్సీబీదే అగ్రస్థానం

బ్రాండ్ విలువలో ఆర్సీబీ అగ్రస్థానంలో నిలవగా, 264 మిలియన్ డాలర్లతో ముంబై ఇండియన్స్ రెండో స్థానంలో నిలిచింది. 245 మిలియన్ డాలర్లతో కోల్‌కతా నైట్‌రైడర్స్, 244 మిలియన్ డాలర్లతో చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా మూడో, నాలుగో స్థానాల్లో ఉన్నాయి. 2026 ఐపీఎల్ సీజన్‌ను ప్రపంచవ్యాప్తంగా 1.06 బిలియన్ స్క్రీన్‌లపై వీక్షించగా, మొత్తం వీక్షకుల సంఖ్య ఏడాది కాలంలో 7 శాతం పెరిగింది. కనెక్టెడ్ టీవీ వీక్షణ 26 శాతం పెరగగా, లీనియర్ టెలివిజన్ వీక్షణ 18.8 శాతం తగ్గింది. డిజిటల్ విస్తరణ, మీడియా హక్కులు, ప్రీమియం భాగస్వామ్యాల బలంతో ఈ సీజన్‌లో ఐపీఎల్ మొత్తం ఆదాయం 1.8 బిలియన్ డాలర్లను దాటినట్లు నివేదిక వెల్లడించింది.

### కొత్త బెంచ్‌మార్క్‌లు

ఈ ఏడాది జరిగిన యాజమాన్య మార్పులు కూడా ఐపీఎల్ వాణిజ్య సామర్థ్యాన్ని మరింత బలపరిచాయి. బ్లాక్‌స్టోన్, బోల్ట్ వెంచర్స్, ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ గ్రూప్ కన్సార్టియం ఆర్సీబీని 1.78 బిలియన్ డాలర్ల విలువతో కొనుగోలు చేయగా, రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం 1.65 బిలియన్ డాలర్ల విలువతో మారడం ఫ్రాంచైజీల మార్కెట్ విలువకు కొత్త ప్రమాణాలను నెలకొల్పిందని నివేదిక పేర్కొంది.

# Business బిజినెస్

## ఆదాయం జోరు.. లాభాలకు బ్రేక్!

- ఒక్కసారి నమోదైన ప్రత్యేక వ్యయంతో నష్టాల్లోకి అదానీ ఎంటర్‌ప్రైజెస్
- నిర్వహణ లాభం రూ.5,642 కోట్లతో కొత్త రికార్డు



**న్యూఢిల్లీ:** అదానీ గ్రూప్ ప్రధాన సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) 2026–27 తొలి త్రైమాసికంలో రూ.1,160 కోట్ల సమీకృత నికర నష్టాన్ని నమోదు చేసింది. అమెరికా ట్రెజరీకి చెందిన ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసీ)తో కుదిరిన సెటిల్‌మెంట్‌కు సంబంధించి రూ.2,644 కోట్ల ప్రత్యేక వ్యయాన్ని ఒకేసారి ఖాతాల్లో చూపడంతో వరుసగా రెండో త్రైమాసికంలోనూ కంపెనీ నష్టాలను ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.885 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. అయితే ప్రత్యేక వ్యయాన్ని మినహాయిస్తే కంపెనీ పనితీరు బలంగానే ఉంది. ఆపరేషన్ల ఆదాయం 50 శాతం పెరిగి రూ.33,546 కోట్లకు చేరగా, నిర్వహణ లాభం (ఈబిట్డా) 49 శాతం వృద్ధితో రికార్డుస్థాయిలో రూ.5,642 కోట్లుగా నమోదైంది. కాపర్, ఎయిర్‌పోర్టుల వ్యాపారాలు ఈ వృద్ధికి ప్రధానంగా దోహదపడ్డాయి. ఎయిర్‌పోర్టుల ఈబిట్డా రూ.1,633 కోట్లకు చేరగా, కాపర్ విక్రయాలు నాలుగు రెట్లకుపైగా పెరిగాయి. ఇరాన్ మూలాల ఎల్‌పీజీ ప్రాసెసింగ్‌కు సంబంధించిన కేసులో 275 మిలియన్ డాలర్ల చెల్లింపును ప్రత్యేక వ్యయంగా పరిగణించినట్లు కంపెనీ తెలిపింది. అలాగే కొత్త సోలార్ మాడ్యూల్ తయారీ సామర్థ్యాన్ని 5.7 గిగావాట్లకు పెంచడంతో పాటు నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో అంతర్జాతీయ సేవల ప్రారంభం, గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై టోల్ వసూళ్లు, రూ.15,000 కోట్ల క్యూఐపీ విజయవంతం కావడం సంస్థ వృద్ధిలో కీలక మైలురాళ్లని చైర్మన్ గౌతమ్ అదానీ పేర్కొన్నారు.

## కొనుగోళ్ల జోరు.. మార్కెట్లు కళకళ

- 889 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్.. 24,250 వద్ద ముగిసిన నిఫ్టీ
- ఎఫ్ఐఐల కొనుగోళ్లు, ఐటీ షేర్ల ర్యాలీతో సూచీలకు భారీ ఊపు



**ముంబై:** విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐలు) తాజా కొనుగోళ్లు, ఐటీతో పాటు బ్లూచిప్ షేర్లలో బలమైన లాభాల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీగా పుంజుకున్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 888.68 పాయింట్లు (1.16 శాతం) ఎగిసి 77,654.60 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 264.85 పాయింట్లు (1.10 శాతం) పెరిగి 24,250.20 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ మధ్యలో సెన్సెక్స్ దాదాపు 1,000 పాయింట్లు ఎగబాకడం విశేషం. హిందుస్థాన్ యూనిలీవర్ 4.70 శాతం, ఇన్ఫోసిస్ 4.50 శాతం, లార్సన్ అండ్ టుబ్రో 2.55 శాతం లాభపడగా, ట్రెంట్, టాటా స్టీల్, భారతి ఎయిర్‌టెల్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కూడా కొనుగోళ్లతో మెరిశాయి. మరోవైపు అదానీ పోర్ట్స్ 3.19 శాతం క్షీణించి అత్యధిక నష్టాన్ని చవిచూసింది. ట్రక్, బస్సుల వ్యాపార బదిలీ ప్రకటన నేపథ్యంలో మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 1.51 శాతం తగ్గగా, ఎస్ఎంఎల్ మహీంద్ర 20 శాతం ఎగిసి అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. మంగళవారం ఎఫ్ఐఐలు రూ.755.33 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేయడం, దేశీయ కంపెనీల మెరుగైన త్రైమాసిక ఫలితాలు, ఐటీ షేర్లలో కొనసాగిన కొనుగోళ్లు మార్కెట్‌కు బలాన్నిచ్చాయి. రంగాల వారీగా ఐటీ, మెటల్, టెలికమ్యూనికేషన్స్, హెల్త్‌కేర్ సూచీలు లాభపడగా, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, రియాల్టీ రంగాలు స్వల్ప ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన నిర్ణయంపై ఇన్వెస్టర్లు దృష్టిసారించిన నేపథ్యంలో, రానున్న రోజుల్లో విదేశీ పెట్టుబడుల ప్రవాహం, డాలర్ కదలికలు, అంతర్జాతీయ పరిణామాలే దేశీయ మార్కెట్ల దిశను నిర్ణయించనున్నాయని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు.

### స్థిరంగా బంగారం.. పుంజుకున్న వెండి

దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం బంగారం ధరలు స్థిరంగా కొనసాగగా, వెండి ధరలు స్వల్పంగా పుంజుకున్నాయి. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,000 వద్ద ఎలాంటి మార్పు లేకుండా నిలిచిందని అఖిల భారత సరాఫా సంఘం తెలిపింది. మరోవైపు, కిలో వెండి ధర రూ.500 పెరిగి రూ.2,25,300 (పన్నులతో కలిపి)కు చేరుకుంది. అంతకుముందు రోజు ఇది రూ.2,24,800గా ఉంది. గత సెషన్‌లో భారీగా తగ్గిన వెండి ధరలు బుధవారం కొంత కోలుకోగా, బంగారం మాత్రం పరిమిత శ్రేణిలోనే ట్రేడైంది. రూపాయి మారకం విలువ బలపడటం దేశీయంగా బంగారం ధరలపై ఒత్తిడి తెచ్చిందని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్సుకు 4,031.73 డాలర్ల వద్ద స్థిరంగా ఉండగా, స్పాట్ సిల్వర్ దాదాపు ఒక శాతం పెరిగి 57.54 డాలర్లకు చేరుకుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయంపై ఇన్వెస్టర్లు ఎదురు చూస్తుండటంతో బంగారం, వెండి ధరలు ప్రస్తుతం స్వల్ప పరిధిలోనే కదులుతున్నాయని నిపుణులు పేర్కొన్నారు. ఫెడ్ విధాన ప్రకటనతో పాటు డాలర్ మారకం విలువ, అమెరికా ట్రెజరీ బాండ్ యీల్డ్‌ల కదలికలే రానున్న రోజుల్లో బులియన్ ధరల దిశను నిర్ణయించనున్నాయని వారు అభిప్రాయపడ్డారు.

## స్విగ్గీకి హోటళ్ల అల్టిమేటం

- చెల్లింపుల్లో పారదర్శకత లేకుంటే ఆగస్టు 15 నుంచి బహిష్కరణ
- అనుమతి లేకుండా ప్రకటన ఛార్జీలు, కోతలపై యజమానుల ఆగ్రహం

**బెంగళూరు:** ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీపై బెంగళూరు హోటళ్ల సంఘం (బీహెచ్ఏ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. చెల్లింపుల్లో పారదర్శకత తీసుకురాకపోతే, అనధికారిక కోతలు నిలిపివేయకపోతే ఆగస్టు 15 నుంచి స్విగ్గీతో వ్యాపార సంబంధాలు పూర్తిగా నిలిపివేస్తామని హెచ్చరించింది. హోటల్ యజమానుల నుంచి ఎలాంటి లిఖితపూర్వక లేదా డిజిటల్ అనుమతి లేకుండానే ప్రకటనలు, ప్రచార కార్యక్రమాల పేరుతో సీపీసీ, సీపీఏ, ఇతర అడ్వర్టైజింగ్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని సంఘం ఆరోపించింది. ప్రకటనల నుంచి ఒక్క క్లిక్‌తో వైదొలిగే (ఆప్ట్–అవుట్) అవకాశం కల్పించాలని డిమాండ్ చేసింది. కమిషన్, జీఎస్టీపీ, ప్రకటనలు, ఆఫర్లు, ఇతర కోతలను విడివిడిగా చెల్లింపు వివరాల్లో చూపించాలని సంఘం కోరింది. వినియోగదారుల నుంచి వసూలు చేసిన జీఎస్టీపై నా అదనపు సేవా రుసుము విధించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేసింది.

### హోటళ్లకు తీవ్ర నష్టం

అనవసర కోతల కారణంగా రూ.1 లక్ష విలువైన ఆర్డర్లకు కొన్ని హోటళ్లకు కేవలం రూ.40 వేల నుంచి రూ.50వేల వరకు మాత్రమే చెల్లింపులు అందుతున్నాయని బీహెచ్ఏ గౌరవాధ్యక్షుడు పీసీ రావు తెలిపారు. ఈ సమస్యలను ఆగస్టు 15లోపు పరిష్కరిస్తే స్విగ్గీతో కొనసాగుతామని, లేకపోతే సేవలను నిలిపివే యడం తప్ప మరో మార్గం ఉండదని స్పష్టం చేశారు. ఈ అంశంపై స్విగ్గీ నుంచి వెంటనే ఎలాంటి అధికారి క స్పందన వెలువడలేదు. కాగా, వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని సంఘం తెలిపింది.

- ఎంఅండ్ఎం ఎఫెక్ట్..

## ఎస్ఎంఎల్ మహీంద్ర షేర్ల జంప్

- రూ.525 కోట్ల పునర్వ్యవస్థీకరణతో 20 శాతం ఎగిసి అప్పర్ సర్క్యూట్
- వాణిజ్య వాహన వ్యాపార విస్తరణతో రూ.12,500 కోట్ల ఆదాయమే లక్ష్యం

**న్యూఢిల్లీ:** మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ఎం) ప్రకటించిన పునర్వ్యవస్థీకరణ ప్రణాళికతో ఎస్ఎంఎల్ మహీంద్ర షేర్లు బుధవారం భారీగా పుంజుకున్నాయి. ట్రక్, బస్సుల విభాగాన్ని రూ.525 కోట్లకు ఎస్ఎంఎల్ మహీంద్రకు బదిలీ చేయనున్నట్లు ప్రకటించడంతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో కంపెనీ షేరు 20 శాతం ఎగిసి అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. బీఎస్ఈలో రూ.4,565.50, ఎన్ఎస్ ఈలో రూ.4,566 వద్ద ముగిసింది. ప్రస్తుతం ఎం అండ్ ఎంకు ఎస్ఎంఎల్ మహీంద్రలో సుమారు 59శాతం వాటా ఉంది. ఈ పునర్వ్యవస్థీకరణతో రెండు వ్యాపారాల మధ్య సమన్వయం పెరిగి, కార్యకలాపాల విస్తరణతో పాటు లాభదాయకత కూడా మెరుగవుతుందని కంపెనీ తెలిపింది. 2030–31 నాటికి వార్షిక ఆదాయాన్ని రూ. 12,500 కోట్లకు పెంచుకోవడంతో పాటు దేశంలో నాలుగో అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థగా ఎదగడమే లక్ష్యమని వెల్లడించింది. ప్రస్తుతం ఎస్ఎంఎల్ మహీంద్ర, ఎం అండ్ ఎం ట్రక్, బస్సుల విభాగాల కలిపిన ఆదాయం రూ.6,000 కోట్లలోపే ఉంది. గత ఏడాది ఎస్ఎంఎల్ ఇసుజును కొనుగోలు చేసి ఎస్ఎంఎల్ మహీంద్రగా పేరు మార్చిన మహీంద్ర గ్రూప్, భారీ వాణిజ్య వాహనాల తయారీని చాకన్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ విధానంలో కొనసాగించనుంది.

## హైపర్‌బూస్ట్ రన్ ఆవిష్కరించిన అడిడాస్

- రోజువారీ రన్నింగ్‌కు అనువుగా కొత్త షూ
- ఆగస్టు 1 నుంచి విక్రయాలు

**న్యూఢిల్లీ:** ప్రముఖ క్రీడా సామగ్రి తయారీ సంస్థ అడిడాస్ తన హైపర్‌బూస్ట్ ఫ్రాంచైజీని విస్తరిస్తూ హైపర్‌బూస్ట్ రన్ పేరుతో కొత్త రన్నింగ్ షూను ఆవిష్కరించింది. రోజువారీ పరుగులు, ఫిట్‌నెస్ కార్యకలాపాలు, చురుకైన జీవనశైలికి అనువుగా రూపొందించిన ఈ షూ ఆగస్టు 1 నుంచి విక్రయాలకు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే విడుదలైన హైపర్‌బూస్ట్ ఎడ్జ్ తర్వాత మార్కెట్లోకి వస్తున్న ఈ కొత్త మోడల్ అత్యధిక సౌకర్యం, వేగవంతమైన ఎనర్జీ రిటర్న్, ఆధునిక డిజైన్‌ను సమన్వయం చేస్తుందని కంపెనీ తెలిపింది. రన్నర్ల శిక్షణ, రోజువారీ వినియోగం రెండింటికీ ఒకే షూను ఉపయోగించేలా దీనిని రూపొందించినట్లు పేర్కొంది. హైపర్‌బూస్ట్ రన్‌లో హైపర్‌బూస్ట్ ప్రో ఫోమ్, 38 మిల్లీమీటర్ల కుషనింగ్, తేలికపాటి ప్రైమ్‌వీవ్ అప్పర్, లైట్‌ట్రాక్షన్ అవుట్‌సోల్తో పాటు కాంటినెంటల్ రబ్బర్ ఫోర్‌ఫుట్ పాడ్స్ను ఉపయోగించారు. అలాగే 3డీ ప్రింటెడ్ హీల్ సపోర్ట్, వెడల్పాటి ప్లాట్‌ఫామ్ కారణంగా మెరుగైన స్థిరత్వం, సౌకర్యం లభిస్తుందని సంస్థ వెల్లడించింది. హైపర్‌బూస్ట్ ఎడ్జ్ మహిళల కోసం హైపర్ వైట్, సోలార్ టర్బో రెడ్, పురుషుల కోసం వైట్, అరోరా ఓనిక్స్ గ్రే రంగుల్లో అడీక్లబ్ సభ్యులకు జులై 29 నుంచే ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. హైపర్‌బూస్ట్ రన్ ధర రూ.17,999, హైపర్‌బూస్ట్ ఎడ్జ్ ధర రూ.19,999గా నిర్ణయించింది. ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లతో పాటు అడిడాస్ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ షూలు అందుబాటులో ఉంటాయని సంస్థ తెలిపింది.



# ప్యారడైజ్ స్పెషల్ సాంగ్ కోసం కీర్తి సురేశ్?

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ది ప్యారడైజ్ పై ఇప్పటి భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. తాజా ప్రచారం ప్రకారం, ఈ చిత్రంలో ఉండే ఓ హై–వోల్టేజ్ మాస్ స్పెషల్ సాంగ్ కోసం జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్‌ను తీసుకోవాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ప్రచారం నిజమైతే నాని, కీర్తి సురేష్ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'నేను లోకల్' మంచి విజయాన్ని అందుకుంది. అనంతరం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన దసరాస లోనూ ఈ జంట మరోసారి ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇప్పుడు అదే దర్శకుడు తెరకెక్కిస్తున్న ది ప్యారడైజ్ లో కీర్తి సురేష్ ప్రత్యేక గీతంలో కనిపించే అవకాశం ఉందనే వార్త అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ పని చేస్తున్నారు. ఇప్పటి ఆయన అందించిన పాటలు దేశవ్యాప్తంగా భారీ ఆదరణ పొందుతున్నాయి. ఒకవేళ కీర్తి సురేష్ స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తే, అనిరుధ్ మాస్ బీట్‌కు ఆమె డ్యాన్స్ మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కీర్తి సురేష్ తెలుగు ప్రేక్షకులకు 'నేను శైలజ' సినిమాతో పరిచయమయ్యారు. తొలి చిత్రంతోనే తన సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, తర్వాత మహానటిలో సావిత్రి పాత్రను అద్భుతంగా పోషించి జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకున్నారు. 'సర్కారు వారి పాట', 'భోళా శంకర్' వంటి పెద్ద చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కమర్షియల్ చిత్రాలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను సమానంగా ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం కీర్తి సురేష్ పలు క్రేజీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. విజయ్ దేవరకొండ సరసన తెరకెక్కుతున్న 'రౌడీ జనార్ధన్' చిత్రంతో పాటు, దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్న వెంకటేష్,కళ్యాణ్ రావ్ మల్టీస్టారర్ చిత్రంలో కూడా ఆమె కథానాయికగా నటిస్తున్నారు. ఈ క్రమంలో ది ప్యారడైజ్‌లో స్పెషల్ సాంగ్ చేసే అవకాశం ఉందనే ప్రచారం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# అఖిల్ వ్యక్తిగత జీవితంపై ట్రోలింగ్



అక్కినేని హీరో అఖిల్ అక్కినేని తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ట్రోలింగ్‌కు తొలిసారి ఘాటుగా స్పందించారు. గతేడాది తన ప్రేయసి జైనబ్‌ని వివాహం చేసుకున్న తర్వాత సోషల్ మీడియాలో ఆమె వయసు, మతంపై వచ్చిన విమర్శలను తాము ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టం చేశారు. ప్రేమ, పరస్పర అవగాహన, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే తమ బంధానికి అసలైన బలమని చెప్పారు. 'లెనిన్' సినిమాతో కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న అఖిల్, ఓ తాజా పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన నెగెటివ్ కామెంట్స్ గురించి అడగగా.. అలాంటి విషయాలకు తాము అసలు ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్ గురించి ఆలోచించాలా? లేక జీవితాంతం నాతో ఉండే వ్యక్తితో సంతోషంగా జీవించడం గురించి ఆలోచించాలా? నాకు రెండోది ముఖ్యమైంది. అందు ట్రోలింగ్‌ను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని అఖిల్ అన్నారు.

# బట్వారా 1947 ట్రైలర్ విడుదల

బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గవ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

# హారర్ థ్రిల్లర్ '418' విడుదల వాయిదా



మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న హారర్ థ్రిల్లర్ '418' కోసం ఎదురుచూస్తున్న సినీ అభిమానులకు స్వల్ప నిరాశ ఎదురైంది. జూలై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించిన మైత్రీ మూవీ మేకర్స్, సినిమా విడుదలను వాయిదా వేస్తున్నామని తెలిపింది. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను మాత్రం వెల్లడించలేదు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని అభిమానులకు హామీ ఇచ్చింది. ప్రస్తుతం చిత్రబృందం విడుదల వాయిదాకు సంబంధించి ఎలాంటి అధికారిక కారణం చెప్పలేదు. దీంతో సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు, విజువల్ ఎఫెక్ట్స్, సాంతిక అంశాలు లేదా విడుదల ప్రణాళికలో మార్పుల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారా అనే చర్చ సినీ వర్గాల్లో సాగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. '418' ఒక ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఇప్పటి విడుదలైన ప్రచార సామగ్రి సినిమాపై ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా సస్పెన్స్, భయానక అంశాలతో కథను తెరకెక్కిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రంలో ప్రీతి పగడాల కథానాయికగా నటిస్తున్నారు. ఆమెతో పాటు చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కొత్త తరహా కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రతి పాత్ర కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణ దర్శకుడు ప్రశాంత్ నీల్ మద్దతు. ఆయన ఈ ప్రాజెక్ట్‌కు అనుబంధంగా ఉండటం వల్ల 418 పై ప్రారంభం నుంచే మంచి బజ్ ఏర్పడింది. ఆయన పేరు జత కావడంతో సినిమా స్థాయిపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రానికి కీర్తన్ నాదగౌడ దర్శకత్వం వహిస్తుండగా, వెంకీ జీజీ సంగీతం అందిస్తున్నారు. హారర్‌తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను సమపాళ్లలో మేళవిస్తూ దర్శకుడు సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. విడుదల వాయిదా పడినప్పటికీ, సినిమా విడుదలపై చిత్రబృందం పూర్తి నమ్మకంతో ఉంది. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మైత్రీ మూవీ మేకర్స్ స్పష్టం చేసింది. దీంతో అభిమానులు ఇప్పుడు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ట్రోల్స్‌ను అస్సలు పట్టించుకోవద్దు



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ శౌర్య భవన్‌లో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 600 మందికి పైగా అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అల్లు అర్జున్, సోషల్ మీడియాలో నిత్యం ఎదురయ్యే అనవసరపు ట్రోల్స్, నెగెటివిటీపై తీవ్రంగా స్పందించారు. నెట్టింట జరిగే దుష్ప్రచారాలను, అనవసర వివాదాలను అస్సలు పట్టించుకోవద్దని, వాటికి ఎలాంటి స్పందన ఇవ్వకుండా సంయమనం పాటించాలని తన అభిమానులకు ఆయన హితవు పలికారు. అభిమానులందరూ సానుల ధోరణితో ముందుకు సాగాలని, తమ సమయాన్ని, శక్తిని మంచి పనుల వెచ్చించాలని బన్నీ ఈ వేదికగా సందేశమిచ్చారు. అభిమానుల ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, వారితో కలిసి ఫోటోలు దిగుతూ సందడి చేశారు. సినిమాల విషయానికి వస్తే.. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీతో రాకా సినిమా చేస్తున్నాడు ఈ చిత్రంలో దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తుండగా.. కళనిధి మారాన్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం అనంతరం లోష్ కనగరాజ్‌తో సినిమా చేయబోతున్నాడు బన్నీ.

# స్పైడర్ మ్యాన్ టికెట్లకు భారీ క్రేజ్



అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న హాలీవుడ్ సూపర్ హీరో చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' విడుదలకు సిద్ధమైంది. సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకున్న ఈ చిత్రం జులై 30న భారతీయ ప్రేక్షకుల ముందుకు రానుంది. టామ్ హాలెండ్ మరోసారి పీటర్ పార్కర్ పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కాగా, టికెట్లకు అనూహ్య స్పందన లభిస్తోంది. ముఖ్యంగా మెట్రో నగరాల్లో ప్రీమియం, లగ్జరీ సీట్లకు భారీ డిమాండ్ ఏర్పడటంతో టికెట్ ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. దేశంలోని నగరాలు, థియేటర్ల ఫార్మాట్లను బట్టి టికెట్ ధరల్లో గణనీయమైన తేడా కనిపిస్తోంది. సింగిల్ స్క్రీన్‌లలో సాధారణ టికెట్ ధరలు రూ.200 నుంచి ప్రారంభమవుతుండగా, దిల్లీలో ప్రీమియం రిక్లైనర్ సీట్ల ధరలు దాదాపు రూ.2,400 వరకు ఉన్నాయి. ముంబయిలోనూ సాధారణ, ప్రీమియం టికెట్ల మధ్య భారీ ధరల వ్యత్యాసం ఉండగా, బెంగళూరులో లగ్జరీ ఫార్మాట్‌ల టికెట్ ధరలు రూ.3,700కు పైగా పలుకుతున్నాయి. భారత్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ సినిమాపై భారీ ఆసక్తి నెలకొంది. తొలి వారాంతంలోనే ప్రపంచవ్యాప్తంగా 800 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు సాధించే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 144 నిమిషాల 52 సెకన్ల నిడివితో తెరకెక్కిన ఈ చిత్రం మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో 38వ చిత్రంగా, స్పైడర్ మ్యాన్ సిరీస్‌లో నాలుగో భాగంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. టామ్ హాలెండ్‌కు జోడీగా జెండాయా నటించగా, సేడీ సింక్, జాకబ్ బాటలాన్‌తో పాటు పలువురు ప్రముఖులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రంపై నెలకొన్న అంచనాలు, టికెట్లకు వస్తున్న స్పందనను చూస్తే విడుదల రోజున బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 'ఛత్రపతి శివాజీ'లో భూమి పెడ్నేకర్



హిందీ నటి భూమి పెడ్నేకర్ మరో ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రంలో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్లు దర్శకుడు సందీప్ సింగ్ వెల్లడించారు. ఈ చిత్రంలో భూమి కర్ణాటకకు చెందిన వీరనారి బెలవాడీ మల్లమ్మ పాత్రలో కనిపించనుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం, వారసత్వంపై రూపొందుతున్న చిత్రంలో భాగం కావడం గౌరవంగా ఉందని తెలిపింది. మల్లమ్మ పాత్ర తన కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన పాత్రలతో పోలిస్తే పూర్తిగా భిన్నమైందని పేర్కొంది. శివాజీ సైన్యంతో ధైర్యంగా పోరాడిన వీరనారిగా పేరొందిన మల్లమ్మ పాత్రకు న్యాయం చేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు భూమి తెలిపింది. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రానికి సందీప్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఏడాది చివర్లో షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం.

# తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

రిజర్వేషన్ల అంశంపై తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు పూర్తిగా అబద్ధమని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని నటి శిల్పా శెట్టి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. తన పేరును ఉపయోగిస్తూ కొందరు కావాలని నిందలు వేస్తున్నారని, అది పూర్తిగా కల్పితమైన వార్త అని స్పష్టం చేశారు. నా పేరును ఉపయోగిస్తూ రిజర్వేషన్లపై వైరల్ అవుతున్న తప్పుడు ప్రకటనలు చూసి తీవ్ర షాక్‌కు గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దుర్బుద్ధితో డిన చెత్త ప్రచారం. ఇలాంటి ఫేక్ న్యూస్‌ను ఎవరూ నమ్మకండి అంటూ శిల్పా రాసుకొచ్చింది. రిజర్వేషన్ వ్యవస్థను ఉద్దేశించి వైద్యులు, కులాల ఆధారంగా రోగులకు చికిత్స చేయాలంటూ శిల్పాశెట్టి ఇన్‌స్టాగ్రావ్ స్టోరీ పెట్టినట్లుగా ఒక స్క్రీన్‌షాట్ నెట్టింట తీవ్ర కలకలం రేపింది. అయితే ఈ వివాదం ముదరకముందే శిల్పా స్పందించి ఆ వార్తలకు తెరదించింది. ఇక సినిమాల విషయానికొస్తే, శిల్పాశెట్టి ఇటీవల ధ్రువ సర్జా, సంజయ్ దత్, రవిచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'డీ: ది డెవిల్' అనే కన్నడ చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'మా హై నా' అనే ప్రముఖ రియాలిటీ కుకింగ్ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.



## డిఫరెంట్ లవ్ స్టోరీ.. చెన్నై లవ్ స్టోరీపై నాగచైతన్య

తనకు ప్రేమకథలంటే ఇష్టమన్నారు నటుడు నాగ చైతన్య. కొవిడ్ తర్వాత లవ్‌స్టోరీలు తెరకెక్కట్లేదని తాను బాధపడినట్లు చెప్పారు. కిరణ్ అబ్బవరం హీరోగా వచ్చిన తాజా చిత్రం 'చెన్నైలవ్ స్టోరీ'. ఈ సినిమా ప్రేక్షకాదరణ సొంతం చేసుకోవడంతో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొవిడ్ తర్వాత ప్రేమకథలు రావట్లేదని భయపడ్డా. ప్రేక్షకులు థియేటర్‌లకు వెళ్తారా.. ప్రేమకథలు చూస్తారా? అని అనుకున్నా ను. ఇప్పుడు మళ్లీ ఆ ట్రెండ్ ప్రారంభమైంది. 'చెన్నై లవ్‌స్టోరీ'తో మంచి ప్రేమకథను అందించారు. ఇప్పటి వర ఇద్దరు ప్రేమించుకోవడం పెళ్లి చేసుకోవడం ఇలాంటి కథలే చూశాం. కానీ, బ్రేకప్ ప్రేమకథ ఎలా ఉంటుందనేది ఇందులో చూపించారు. ఇప్పటి తరానికి బాగా కనెక్ట్ అయ్యే కథ ఇది. ఇలాంటి స్టోరీలు రావాలని ఎంతో ఎదురుచూశా. ఈ చిత్రం చూసిన తర్వాత చాలా ఆనందించా' అని నాగచైతన్య అన్నారు. సాయి రాజేశ్ ఈ కథను చాలా గొప్పగా రాశారని ప్రశంసించారు. కిరణ్ అబ్బవరం ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చారని నాగచైతన్య అన్నారు.

# పొలిమేర-3లో అర్జున్

టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు డా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.